ఈనాడు సూర్యాపేట
గురువారం అక్టోబరు 10, 2024

నిధులు మంజూరు

సూర్యాపేట కలెక్టరేట్, న్యూస్‌టుడే: జిల్లాలో పవర్ గ్రిడ్ ద్వారా కార్పొరేట్ సోషల్ రెస్పాన్సిబిలిటీ(సీఎస్ఆర్) నిధుల కింద జిల్లాకు రూ. 1.50 కోట్లు మంజూరైనట్లు కలెక్టర్ తేజస్ నందలాల్ పవార్ పేర్కొన్నారు. కలెక్టరేట్‌లో బుధవారం ఒప్పంద పత్రాలపై కలెక్టర్‌తోపాటు పవర్ గ్రిడ్ సీఎండీ అరుణ్ కుమార్ సంతకాలు చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. జిల్లాలో అంగన్‌వాడీ భవనాలు, పంచాయతీ కార్యాలయాలు, పాఠశాలలో అదనపు తరగతి గదులు నిర్మించేందుకు ఉపయోగిస్తామని తెలిపారు. కార్యక్రమంలో సీపీవో కిషన్, ఉద్యోగులు, సిబ్బంది పాల్గొన్నారు.

పకడ్బందీగా డిజిటల్ ప్రక్రియ


తిరుమలగిరి పురపాలిక కార్యాలయంలో వివరాలు అడిగి తెలుసుకుంటున్న అదనపు కలెక్టర్ బీఎస్.లత

తిరుమలగిరి, న్యూస్‌టుడే: కుటుంబ డిజిటల్ కార్డుల ఆన్‌లైన్ నమోదు ప్రక్రియను పకడ్బందీగా చేపట్టాలని అదనపు కలెక్టర్ బీఎస్ లత సూచించారు. బుధవారం తిరుమలగిరిలో పురపాలిక కార్యాలయంలో ఆన్‌లైన్ వివరాల నమోదును పరిశీలించారు. ఈ సందర్భంగా సిబ్బందికి పలు సూచనలు చేశారు. అనంతరం తిరుమలహిల్స్ ఎల్ఆర్ఎస్ సర్వేను పరిశీలించారు. ఎల్ఆర్ఎస్ ప్రక్రియ వీలైనంత తొందరగా పూర్తిచేయాలన్నారు. ఇన్‌ఛార్జి కమిషనర్ ఎం.బుచ్చిబాబు, తహసీల్దార్ హరిప్రసాద్, ఆర్ఐ బాబ, సిబ్బంది సంపత్, యాకస్వామి తదితరులున్నారు.

మార్కెట్‌కు నాలుగు రోజులు సెలవులు

తిరుమలగిరి, న్యూస్‌టుడే: తిరుమలగిరి వ్యవసాయ మార్కెట్‌కు గురువారం సద్దుల బతుకమ్మ, శుక్రవారం మహర్నవమి, శనివారం విజయదశమి పర్వదినం, ఆదివారం వారాంతపు సెలవు కావటంతో నాలుగు రోజులు సెలవులు ప్రకటిస్తున్నట్లు మార్కెట్ కార్యదర్శి దేశబోయిన శ్రీధర్ బుధవారం తెలిపారు. రైతుల తమ పంట ఉత్పత్తులను తిరిగి 14న సోమవారం మార్కెట్‌కు తీసుకురావాలని పేర్కొన్నారు.

గుట్టుక్కు..!


చిమిర్యాల రెవెన్యూ పరిధిలో గుట్టల రూపంలో ఉన్న ప్రభుత్వ భూమిని చదును చేసిన వైనం

కోదాడ గ్రామీణం, న్యూస్‌టుడే:

ప్రభుత్వాలు మారినా, రెవెన్యూ చట్టాలు ఎన్ని ఉన్నా ఆక్రమణదారుల తీరు మారడం లేదు. ప్రభుత్వ భూములకు రక్షణగా నిలవాల్సిన అధికారులు చప్పుడు చేయకపోవడంతో అక్రమదారుల ఆగడాలకు అడ్డు అదుపు లేకుండా పోతోంది. వివిధ శాఖల అధికారులు ఆమ్యామ్యాలకు అలవాటు పడి రూ.కోట్ల విలువైన ప్రభుత్వ భూములను కబ్జాదారుల చేతుల్లో పెడుతున్నారు. కోదాడ మండలంలోని చిమిర్యాల, కాపుగల్లు, నెమలిసురి, దోరకుంట రెవెన్యూ పరిధిలోని మట్టి గుట్టలు, ఏనెలు యాభై ఎకరాలకు పైనే ఆక్రమణకు గురైనట్లు సమాచారం.

ఆక్రమణకు మూలం మట్టి దందా..

చిమిర్యాలలోని 474 సర్వే నంబరులో 45.30 ఎకరాలు, కాపుగల్లులోని 101, 292 సర్వే నం.లో 72.34, 134 ఎకరాల ప్రభుత్వ భూమి అంటే దాదాపు 251.64 ఎకరాల భూమి ఏనె(గుట్ట) రూపంలో ఉంది. ఒకప్పుడు పచ్చని వాతావరణంతో ఆహ్లాదకరంగా ఉన్న ఏనెలు(గుట్టలు) ప్రస్తుతం ఆక్రమణల పాలవుతున్నాయి. మండలంలో మట్టి మాఫియాగా చలామణి అవుతున్న కొందరి కన్ను ప్రకృతి సిద్ధమైన ఏనెలపై పడింది. పెద్ద యంత్రాలతో రాత్రి, పగలు తేడా లేకుండా మట్టిని అక్రమ మార్గాన తరలిస్తున్నారు. మట్టి మాఫియా కోట్ల వ్యాపారం చేస్తూ.. అంతటితో ఆగకుండా మట్టి తీయగా ఏర్పడిన గోతుల్లో పెద్ద బండ రాళ్లు వేసి పూడుస్తారు. అనంతరం బండరాళ్లపై మెత్తటి నల్లరేగడి, ఎర్రమట్టిని టిప్పర్లతో తెప్పించి సమానం చేసి ఆక్రమించుకోవడం ఆనవాయితీగా మారింది. ఆ భూమిలో మామిడి మొక్కలు నాటి సాగు చేస్తున్నారు.

★ వీఆర్వో వ్యవస్థ రద్దు కావడంతో క్షేత్ర స్థాయిలో తిరిగేందుకు అధికారులకు భారంగా మారుతోంది. బదిలీపై వచ్చే కొత్త అధికారులు మండలంపై పట్టు సాధించే లోపే మరో స్థానానికి బదిలీ అవుతున్నారు. పని ఒత్తిడి కారణంగా క్షేత్రస్థాయిలో అధికారులు తిరగడం లేదు. దీనిని ఆసరాగా తీసుకొని కొందరు ఆక్రమణల పర్వానికి తెర లేపుతున్నారు.

ఆక్రమణదారులపై క్రిమినల్ చర్యలు:

వాజీద్, కోదాడ తహసీల్దార్

మండలంలో మట్టి తరలించేందుకు అనుమతులు లేవు. ఆక్రమణలకు మూలం మట్టి తరలింపేనని ప్రాథమికంగా గుర్తించాం. ఆక్రమణకు గురైన భూములను పరిశీలించి మట్టి వ్యాపారులపై, ఆక్రమణదారులపై క్రిమినల్ కేసులు పెడతాం.

శిక్షణ ధ్రువీకరణ పత్రాలు అందజేత


నూతనకల్‌లో సహాయకులకు పత్రాలు అందిస్తున్న డీఈ అజయ్, ఎంపీడీవోలు సునిత, సత్యనారాయణరెడ్డి

నూతనకల్, న్యూస్‌టుడే: నూతనకల్ మండలపరిషత్ కార్యాలయంలో నూతనకల్, మద్దిరాల మండలాల మంచినీటి సహాయకులకు నాలుగురోజులుగా నిర్వహిస్తున్న ప్రత్యేక శిక్షణ బుధవారం ముగిసింది. ఈ సందర్భంగా శిక్షణ పూర్తిచేసుకున్న సహాయకులకు ధ్రువీకరణ పత్రాలను అందించారు. ఇక్కడ పొందిన శిక్షణను గ్రామాల్లో ఆచరించాలని ఆర్‌డబ్ల్యూఎస్ డీఈ అజయ్ కోరారు. నూతనకల్, మద్దిరాల మండలాల ఎంపీడీవోలు సునిత, సత్యనారాయణరెడ్డి, ఎంపీవో శశికళ, నూతనకల్, మద్దిరాల మండలాల ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈలు ఉదయ్‌కుమార్, అఖిల్, అశోక్ గ్రామాల మంచినీటి సహాయకులు పాల్గొన్నారు.

హృదయాలు మురిసేలా.. ఉయ్యాల పాట..!



బతుకమ్మ ఆడుతున్న మహిళలు

మోత్కూరు, న్యూస్‌టుడే:

ప్రకృతిని ఆరాధించే అతిపెద్ద పండగ బతుకమ్మ. ఏ పూజ చేసినా, కార్యక్రమం నిర్వహించినా పూలతో అలంకరించడం ఆనవాయితీ. కానీ ఆ పువ్వులనే దైవంగా పూజించే అరుదైన వేడుక ఇది. ఈ పండగ వచ్చిందంటే పల్లెల కేరింతలు. యువతుల ఆటలు.. అమ్మల పాటలు.. తొమ్మిది రోజులు మహిళల్లో కనిపించే ఉత్సాహం మాటల్లో చెప్పలేం. చిన్న, పెద్ద పట్టణమైనా, దేశంలో ఎక్కడ ఉన్నా చివరికి విదేశాల్లో మనవాళ్ళున్న చోట బతుకమ్మ వేడుక వైభవంగా నిర్వహిస్తున్నారు. ఎనిమిది రోజులుగా ఆడుతున్న మహిళలు నేడు సద్దుల బతుకమ్మను పెద్దఎత్తున నిర్వహించుకునేందుకు ఉమ్మడి నల్గొండ జిల్లా వ్యాప్తంగా సిద్ధమయ్యారు.

ప్రత్యేక నైవేద్యం.. ఆరోగ్యం

ఎంగిలిపువ్వు నుంచి ఎనిమిది రోజుల పాటు ఆడుకుంటూ.. తొమ్మిదోరోజున జరిపే వేడుకనే సద్దుల బతుకమ్మ. పెరుగన్నం, చిత్రాన్నం, కొబ్బరిపొడి, నువ్వులపొడి ఇలా.. ఐదురకాల సద్దులతో నైవేద్యం చేస్తారు. బతుకమ్మతో పాటే వివిధ రకాల ఫలహారాలను చెరువు దగ్గరికి తెచ్చి పంచి పెడతారు. సత్తుపిండి, పల్లీముద్దలు, సజ్జపిండి పంచుతారు. సజ్జలు, బెల్లం, నెయ్యికలిపి చేసిన పిండి ముద్దలు.. ఇవన్నీ రక్తహీనతను



నేడే సద్దుల బతుకమ్మ

తగ్గించేందుకు ఉపయోగపడతాయి. పల్లీ ముద్దలు పిల్లలకు బలవర్ధకమైన ఆహారం. సత్తు పిండిని పిలిచే మొక్కజొన్న పేలాల పిండిలో పీచు పదార్థం వల్ల మలబద్ధకం తగ్గుతుంది.

ఇస్తినమ్మ వాయినం..

బతుకమ్మను చెరువుల్లో నిమజ్జనం చేసి బతుకమ్మను పేర్చిన పళ్లాలు, ప్లేట్లలో నీరు తెస్తారు. అందులో గౌరమ్మను ఉంచి పాటలు పాడుతూ, ఒలలాడిస్తారు. మరో ఆసక్తికర అంశం వాయినం. ఆడపడుచులు సేకరించిన పూలను పంచుకోవడంతో మొదలవుతుంది. పలహారాన్ని పరస్పరం ఒకరికి ఒకరు ఇచ్చుకుంటారు. సద్దుల బతుకమ్మరోజు చెరువుదగ్గరకు మలీదముద్దలు తీసుకుని వెళ్తారు.

సద్దులు ఇలా..

పెసరముద్దలు.. పెసర్లను ఉడకబెట్టి అందులో బెల్లం కలిపి ముద్దలుగా తయారు చేస్తారు.

సజ్జముద్దలు.. ఈ పండగొచ్చే అందరికీ సద్దుముద్దలు(సజ్జముద్దలు) గుర్తొస్తాయి. ఈ పేరుతోనే పెద్ద బతుకమ్మను సద్దుల బతుకమ్మ అంటారని చెబుతారు. ప్రస్తుతం సజ్జలు అంతగా లభించడం లేదు. సజ్జలను పిండిగా పట్టించి రొట్టెలు చేస్తారు. రొట్టెలను, బెల్లాన్ని కలిపి దంచి ముద్దలు చేస్తారు.

సత్తుపిండి.. సత్తుపిండిని మొక్కజొన్నలతో చేస్తారు. దీనికి కూడా బెల్లం జోడిస్తారు.

నువ్వులు.. నువ్వులను పొడిచేసి బెల్లంతో ముద్దలు చేస్తారు. పల్లీపిండి.. కొబ్బరిపొడి.. పెరుగన్నం.. పులిహోరలను ఈసద్దు సద్దిగా ఇస్తున్నారు. పెరుగన్నంలో పల్లీలు, వివిధ రకాల ధాన్యాలను కలుపుతున్నారు. చింతపండు లేదా నిమ్మరసంలో చేసిన పులిహోర కూడా ప్రసాదంగా వాడుతున్నారు.

ఒక్కేసి పువ్వేసి చందమామ
ఒక్కజాములాయె చందమామ
శివపూజ వేళాయె చందమామ
శివుడుజాడలేదు చందమామ
గంగని వాకిట చందమామ
బంగారు పాకోళ్లు చందమామ
రెండేసి పూలేసి చందమామ
రెండు జాములాయె చందమామ

★ 'ఇద్దరక్క చెల్లెళ్లాను ఉయ్యాలో
ఒక్కూరికిచ్చిరి ఉయ్యాలో
పెద్దలకువచ్చింది ఉయ్యాలో
పెత్తామాన ఉయ్యాలో
పిల్లలకువచ్చింది ఉయ్యాలో
బతుకమ్మ పండుగ ఉయ్యాలో'

రాగి, జొన్నలు, గోధుమలతో గానీ, బియ్యంతోగానీ తయారైన పిండితో రొట్టెచేసి వాటిని చిన్నచిన్న ముక్కలుగా చేసి దంచి బెల్లం పాకంలో కలిపి చేసిన ముద్దలను మలీద ముద్దలంటారు. వీటిని బతుకమ్మ వాయినాలుగా ఇచ్చిపుచ్చుకుంటారు.

మహిళలకు పెద్ద పండగ..



– డాక్టర్ బండారు సుజాతశేఖర్ (దేవరకొండ, బతుకమ్మపై పరిశోధకురాలు)

మహిళలకు బతుకమ్మ పండగ ఎంతో పెద్దది. తరతరాలుగా పూలను పూజించే గొప్ప వేడుక ఇది. ఎంతో విశిష్టత కలిగిన ఈ పండగ మన తెలుగువారు ఏ దేశంలో ఉన్నా అక్కడ జరుపుకొంటున్నారు. దీని ప్రాశస్త్యం భావితరాలకు అందించాల్సిన అవసరం ఉంది.

పల్లెల్లో సంబరం అంతాఇంతా కాదు..



– పోరెడ్డి రాజేశ్వరి (ఉపాధ్యాయిని, ఆలేరు)

పల్లెల్లో ఈ పండగ వచ్చిందంటే మహిళల్లో ఎంతో సంతోషం కనిపిస్తుంది. చిన్నా, పెద్ద అంతా కలిసి ఆడుకోవడంలోనే బతుకమ్మ ప్రాధాన్యం ఉంటుంది. ఇంకా గ్రామాల్లో డీజేలకు బదులుగా పాటలు పాడుతూనే ఆడుకుంటున్నారు. నాటితరం వారే బతుకమ్మ పాటలు పాడుతున్నారు. నేటితరం వారూ ఆ పాటలు నేర్చుకుని పండగ ఖ్యాతిని భావితరాలకు అందించాలి.

పేట సమగ్రాభివృద్ధికి కృషి: మాజీ మంత్రి

సూర్యాపేట (తాళ్లగడ్డ), న్యూస్‌టుడే: అమ్మవారి దయతో సూర్యాపేట సమగ్రాభివృద్ధికి కృషి చేస్తానని మాజీ మంత్రి, ఎమ్మెల్యే జగదీశ్‌రెడ్డి పేర్కొన్నారు. మండల పరిధిలోని తాళ్లఖమ్మంపహాడ్‌లో దుర్గా యూత్ ఆధ్వర్యంలో నెలకొల్పిన దుర్గామాతకు బుధవారం ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. ప్రకృతిని ఆరాధించే సంప్రదాయం తెలంగాణకు మాత్రమే సొంతమన్నారు. అంతకుముందు ఎనిమిదో వార్డులోని దుర్గామాతకు పూజలు చేశారు. జడ్పీటీసీ మాజీ సభ్యుడు జీడి భిక్షం, ఊర్మిళ సంతోష్‌రెడ్డి, సంకరమద్ది రమణారెడ్డి, నాగరాజు, శ్రీనివాస్‌రెడ్డి, బెల్లంకొండ సైదులు, వెంకన్న, ఆకుల నరేశ్ పాల్గొన్నారు.


సూర్యాపేట: తాళ్లఖమ్మంపహాడ్‌లో దుర్గామాతకు పూజలు చేసిన అనంతరం మాట్లాడుతున్న మాజీ మంత్రి, ఎమ్మెల్యే జగదీశ్‌రెడ్డి

చదువుల తల్లిగా.. చల్లని తల్లి


నేరేడుచర్ల శివాలయంలో ప్రత్యేక పూజల్లో భక్తులు

సూర్యాపేట సాంస్కృతికం: సూర్యాపేట జిల్లా కేంద్రంలో దేవి శరన్నవరాత్రి ఉత్సవాలు వైభవంగా కొనసాగుతున్నాయి. పట్టణంలోని ఆయా మండపాల వద్ద నెలకొల్పిన దుర్గామాత విగ్రహాల వద్ద భక్తులు కుంకుమ పూజలు నిర్వహించారు. ఏడో రోజు కనకదుర్గ ఆలయం, కన్యకాపరమేశ్వరి, సంతోషీమాత ఆలయంలో అమ్మవారు సరస్వతి దేవిగా భక్తులకు దర్శనం ఇచ్చారు. ఆలయాల్లో తెల్లవారుజామున ఆలయానికి చేరుకొని అమ్మవారిని దర్శించుకుని మొక్కులను చెల్లించుకున్నారు. ఆయా మండపాల వద్ద భక్తులకు అన్నప్రసాద వితరణ చేపట్టారు.

మద్దిరాల: మండలవ్యాప్తంగా భక్తులు, ఉత్సవ కమిటీ సభ్యులు ఘనంగా పూజలు నిర్వహించారు. అమ్మవారు ఏడో రోజు సరస్వతిదేవిగా భక్తుల దర్శనమిచ్చారు. మండలంలోని చిననెమిలలో జన చైతన్య యువజన కమిటీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసి దుర్గామాత మండపం వద్ద రామడుగు వెంకటేశ్వరరావు, శ్రీలత దంపతులు అన్నదానం చేశారు. ఆయా మండపాల వద్ద కోలాటాలు, నృత్యాలు చేస్తూ భక్తులు ఆడిపాడారు.

నేరేడుచర్ల: విజయదుర్గ ఆలయం, శివాలయంలో దేవీ శరన్నవరాత్రి ఉత్సవాలలో బుధవారం అమ్మవారు సరస్వతీదేవిగా పూజలందుకున్నారు. విద్యాభివృద్ధి కోసం తల్లులు తమ పిల్లలతో పూజా కార్యక్రమాలు నిర్వహింపజేశారు. విజయదుర్గ ఆలయంలో అన్నదాన కార్యక్రమాన్ని పురఛైర్మన్ బచ్చలకూరి ప్రకాశ్, హుజూర్‌నగర్ సీఐ చరమందరాజు, మార్కెట్ కమిటీ వైస్‌ఛైర్‌పర్సన్ విజయలక్ష్మి ప్రారంభించారు.


సూర్యాపేట: సరస్వతి దేవిగా కన్యకాపరమేశ్వరి అమ్మవారు


మద్దిరాలలో సరస్వతిదేవి అవతారంలో దుర్గామాత


సూర్యాపేట: కలెక్టరేట్‌లో బతుకమ్మ ఆడుతున్న అదనపు కలెక్టర్ బీఎస్.లత, మహిళా ఉద్యోగులు, సిబ్బంది

సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీక బతుకమ్మ

సూర్యాపేట కలెక్టరేట్, న్యూస్‌టుడే: సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీకగా తెలంగాణలో బతుకమ్మ పండగ నిలుస్తుందని కలెక్టర్ తేజస్ నందలాల్ పవార్ పేర్కొన్నారు. కలెక్టరేట్‌లో ఐసీడీఎస్ ఆధ్వర్యంలో బుధవారం బతుకమ్మ సంబరాలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఈ పండగ మహిళలకు ప్రత్యేకమని, ప్రకృతిలో లభించే పూలు సేకరించి అందంగా బతుకమ్మ పేర్చి పూజిస్తారని తెలిపారు. అదనపు కలెక్టర్ బీఎస్.లత మాట్లాడుతూ.. ప్రపంచ వ్యాప్తంగా బతుకమ్మ పండగ ఎంతో ప్రాచుర్యం పొందిందని పేర్కొన్నారు. అనంతరం కలెక్టర్ సతీమణి, మహిళా సిబ్బందితో కలిసి బతుకమ్మ ఆడారు. పవర్ గ్రిడ్ సీఎండీ అరుణ్ కుమార్, డీఆర్డీవో అప్పారావు, డీడబ్ల్యూవో నర్సింహారావు, డీటీడీవో శంకర్, సంక్షేమ శాఖ అధికారులు లత, అనసూయ, డీసీవో పద్మ, ఏవో సుదర్శన్‌రెడ్డి పాల్గొన్నారు.


గౌరమ్మకు వందనం చేస్తున్న కలెక్టర్ తేజస్ నందలాల్ పవార్

నయనం.. ఎటువైపు పయనం..!



మిర్యాలగూడలోని ఓ పాఠశాలలో కంటి పరీక్షలు చేస్తున్న వైద్యులు (పాత చిత్రం)

మిర్యాలగూడ పట్టణం, న్యూస్‌టుడే:

◆ నేడు 'ప్రపంచ దృష్టి దినోత్సవం'

ఇటీవలి కాలంలో వయస్సుతో సంబంధం లేకుండా రెండేళ్ల చిన్నారి నుంచి 70 ఏళ్ల వృద్ధుడి వరకు ప్రతి ఒక్కరు కంటి సమస్యలతో బాధపడుతూ.. కళ్లకు అద్దాలతో దర్శనమిస్తున్నారు. ప్రస్తుత కాలంలో అన్ని వయస్సుల వారు చరవాణి, ల్యాప్‌టాప్, కంప్యూటర్, టీవీ తెరలకు అతుక్కుపోతుండటంతో ఇందుకు కారణం. కంటిపై ఒత్తిడి పెరిగి చూపు మందగిస్తుంది. శరీరంలో అత్యంత ప్రధానమైన కళ్లను కాపాడాలనే ఉద్దేశంతో ఏటా అక్టోబరు రెండో గురువారం 'ప్రపంచ దృష్టి దినోత్సవం' నిర్వహిస్తున్నారు.

ప్రభుత్వ చర్యలు..

పిల్లల్లో కంటి సమస్యలు అధికంగా వస్తున్నాయని గ్రహించిన ప్రభుత్వం వారికి చికిత్స అందించేందుకు ప్రత్యేక చర్యలు చేపడుతోంది. ఆర్బీఎస్కే, నేత్ర వైద్యుల ఆధ్వర్యంలో ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేసి ఐదో తరగతి నుంచి పదో తరగతి విద్యార్థులకు కంటి పరీక్షలు నిర్వహించారు. గత నెల 20 నుంచి ఈ నెల 2 వరకు నల్గొండ జిల్లాలో సుమారు 48,794 మందికి పరీక్షలు నిర్వహించగా.. 2,960 మందిలో సమస్యలు ఉన్నట్లు గుర్తించారు, సూర్యాపేట జిల్లాలో మొత్తం 26,177 మందికి పరీక్షలు నిర్వహించగా.. 841 మందిలో సమస్యలు ఉన్నట్లు గుర్తించారు. సమస్యలు ఉన్న వారికి చికిత్స అందించేందుకు సిఫారసు చేశారు.

ఉమ్మడి జిల్లాలో ఇటీవల కాలంలో చేపట్టిన కంటి పరీక్షలు, సమస్యలు ఉన్న వారి వివరాలు..

జిల్లా	పరీక్షించిన విద్యార్థులు	సమస్యలు ఉన్నవారు
నల్గొండ	48,794	2,960
సూర్యాపేట	26,177	841
యాదాద్రి	13,710	931

నల్గొండ జిల్లాల్లో ఆర్బీఎస్కే వైద్య బృందం, చేసిన పరీక్షల వివరాలు...

ఆర్బీఎస్కే వైద్యాధికారి	కేంద్రం	పరీక్షల సంఖ్య
నితిన్	మిర్యాలగూడ	6,527
గణేష్	మిర్యాలగూడ	6,372
రాంరెడ్డి	నకిరేకల్	6,077
దయానంద్	మర్రిగూడ	6,243
విజయ్‌కుమార్	మర్రిగూడ	5,700
నర్సింహ	దేవరకొండ	5,935
మల్లేష్	దేవరకొండ	6,105
రాంబాబు	హాలియా	5,835

పాటించాల్సిన నియమాలు..

- ప్రతి 20 నిమిషాలకు ఒకసారి తెర నుంచి దృష్టిని మరల్చాలి.
- తెర వెలుతురు కంటే బయటి వెలుతురు ఎక్కువ ఉండేలా చూడాలి.
- రోజులో రెండు గంటలకంటే ఎక్కువ సేపు తెరలను చూడకపోవడం మంచిది.
- ధూమపానం కళ్లను పొడిబారేలా చేసి.. కంటి చూపును దెబ్బతీస్తుంది.
- అపరిశుభ్రమైన చేతులతో కళ్లను తాకడం వల్ల ఇన్‌ఫెక్షన్ సోకే ప్రమాదం ఉంది.
- సరిపడా నీళ్లు తాగడం వల్ల కళ్లలో తేమ శాతం పెరిగి కంటి సమస్యలు నివారించవచ్చు.
- కంటి ఆరోగ్యాన్ని రక్షించుకోవడానికి విటమిన్ ఏ, సి, ఈ అధికంగా ఆహారాలు తరచుగా తీసుకోవాలి.

పిల్లల్లో పెరిగిన కంటి సమస్యలు:




డాక్టర్ బీసం కిరణ్, కంటి వైద్యుడు, ప్రాంతీయ వైద్యశాల, మిర్యాలగూడ

కరోనా అనంతరం మారిన పరిస్థితుల కారణంగా మూడేళ్ల వయసు పిల్లల నుంచే కంటి సమస్యలు రావడం మొదలైంది. దీనికి ప్రధాన కారణం ఫోన్, టీవీ వంటి తెరలను పరిమితికి మించి చూడటం. రోజులో కేవలం 30 నిమిషాలు మాత్రమే పిల్లలు తెరలు చూసేలా కట్టడి చేయాలి. నిత్యం కనీసం రెండు గంటల పాటు మైదానంలో ఆటలాడటం వల్ల దూరపు చూపు అలవాటవుతోంది. మధ్య వయస్కుల్లో వచ్చే చత్వారం, శుక్లాల సమస్యను చికిత్సతో నయం చేయొచ్చు. కంప్యూటర్ తెరలను అదే పనిగా చూసే ఉద్యోగులు కనీసం గంటకోసారి రెండు నిమిషాల పాటు కళ్లు మూసుకోవాలి.

పరీక్షల్లో వెలుగు చూసిన అంశాలు ఇలా..

- త్రిపురారం మండలం రాగడప గ్రామానికి చెందిన ఓ బాలికకు రెటీనాస్ డిసీస్ కారణంగా పుట్టుకతోనే కంటిలో శుక్లాలు ఉండగా.. 15 సంవత్సరాల వయస్సులో గుర్తించి.. శస్త్రచికిత్సకు సిఫారసు చేశారు.
- మిర్యాలగూడ జడ్పీ బాలికల ఉన్నత పాఠశాలలో ఓ విద్యార్థినికి శుక్లాలు వచ్చినట్టు గుర్తించి శస్త్ర చికిత్సకు సిఫారసు చేశారు.
- మిర్యాలగూడలోని ఏడు కోట్ల తండాకు చెందిన ఓ బాలుడు పుట్టుకతోనే ఎమౌరోసిస్ అనే వ్యాధి బారిన పడి కంటి చూపు మందగించడం గుర్తించారు.
- మిర్యాలగూడకు చెందిన ఓ ఎల్కేజీ విద్యార్థికి కంటి పరీక్షలు చేయగా.. మైనస్ 8గా నమోదు కావడంతో వైద్యులు కంగుతిన్నారు.
- ఓ ఆరేళ్ల బాలుడికి కంటి పక్షవాతం ఉన్నట్లు గుర్తించి శస్త్ర చికిత్స చేసి సరి చేశారు.



మహిషాసుర సంహారం.. విశిష్టతల సమాహారం



మట్టపల్లి: నవరాత్రుల్లో పూజలందుకుంటున్న దుర్గాదేవి

మఠంపల్లి, న్యూస్‌టుడే: హిందువుల ముఖ్యమైన పండగలలో ప్రధానమైన దసరాకు ఎన్నో విశిష్టతలు ఉన్నాయి. తొమ్మిది రోజుల పాటు ఆధ్యాత్మిక వాతావరణంలో భక్తిపారవశ్యంతో గడిపే ఈ నవరాత్రుల్లో శక్తి ఆరాధనకు ప్రాధాన్యమిస్తారు.

◆ శరదృతువు ఆరంభంలో వచ్చే ఈ పర్వదినాన్ని శరన్నవరాత్రిగా, జగన్మాత మహిషాసురుడితో తొమ్మిది రాత్రులు యుద్ధం చేసి ఆ రాక్షసుడిని వధించిన రోజును విజయదశమిగా వ్యవహరిస్తారు. పలు ప్రాంతాలలో మొదటి మూడు రోజులు పార్వతీదేవిని, తదుపరి మూడు రోజులు లక్ష్మీదేవిని, చివరి మూడు రోజులు సరస్వతీదేవిని ఆరాధిస్తారు. ఇదే రోజు శ్రీరాముడు రావణుడిపై విజయం సాధించడం, పాండవులు వనవాసానికి వెళ్తూ జమ్మిచెట్టుపై ఉంచిన తమ ఆయుధాలను తిరిగి తీసుకున్నారని పురాణ కథనం.

◆ దుర్గాష్టమి నాడు అమ్మవారు మహిషాసుర మర్దినిగా దర్శనమిస్తుంది. మహిషం అంటే దున్నపోతు(పశువు). పశుత్వం నుంచి అసుర(రాక్షస) శక్తులు వస్తాయి. తద్వారా దుష్టబుద్ధులు, దురాచారాలు ప్రబలుతాయి. వాటిని మర్దనం చేసే తల్లిగా కనకదుర్గ మహిషాసుర మర్దినిగా అవతరించింది. విజయదశమి రోజు జగన్మాత శ్రీరాజరాజేశ్వరీదేవిగా దర్శనమిస్తుంది. నాలుగు చేతుల్లో పాశం, అంకుశం, చెరుకుగడ, పుష్ప బాణం ధరించి అపరాజితాదేవిగా, దివ్యమంగళ స్వరూపిణిగా సాక్షాత్కరిస్తుంది.

శమీపూజకు ప్రాధాన్యం:

–ఫణిశర్మ ఘనపాటి, ఎస్‌ఎల్‌ఎన్ వేద పాఠశాల అధ్యాపకుడు, మట్టపల్లి

శమీ అంటే జమ్మిచెట్టు. ఎంతో ప్రాశస్త్యం ఉన్న ఈ వృక్షాన్ని విజయదశమి రోజు ఆరాధించడం లక్ష్మీప్రదం. పూజల అనంతరం శమీ పత్రాలను దేవుని మందిరాలలో, నగదు భద్రపరిచే పెట్టెలలో ఉంచాలి. 'శమీ శమయతే పాపం శమీశత్రు వినాశనీ.. అర్జునస్య ధనుర్ధారీ రామస్య ప్రియదర్శినీ' శ్లోకాన్ని స్మరిస్తూ శమీ వృక్షం చుట్టూ ప్రదక్షిణలు చేశాక శ్వేత పత్రంపై ఈ శ్లోకం రాసిన కాగితాలను చెట్టు కొమ్మలకు తగిలించాలి. దీనివల్ల అభీష్టాలు నెరవేరతాయి.

విశ్రాంత ప్రభుత్వ ఉద్యోగి ఆత్మహత్య

చౌటుప్పల్‌గ్రామీణం, న్యూస్‌టుడే: అనారోగ్యంతో బాధపడుతున్న విశ్రాంత ప్రభుత్వ ఉద్యోగి పురుగు మందు తాగి ఆత్మహత్య చేసుకున్న ఘటన చౌటుప్పల్‌లో చోటుచేసుకుంది. చౌటుప్పల్‌కు చెందిన బాతరాజు నర్సింహ(62) సంస్థాన్‌నారాయణపురంలోని ఎంపీడీవో కార్యాలయంలో అటెండర్‌గా పని చేసి ఉద్యోగ విరమణ పొందారు. పదేళ్లుగా పక్షవాతంతో బాధపడుతున్నాడు. ఆరోగ్యం సహకరించకపోవడంతో మనస్తాపం చెంది మంగళవారం రాత్రి ఇంట్లో పురుగు మందు తాగి ఆత్మహత్యా యత్నానికి పాల్పడ్డారు. గమనించిన కుటుంబ సభ్యులు మెరుగైన చికిత్స నిమిత్తం హైదరాబాద్‌లోని ఉస్మానియా ఆసుపత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ నర్సింహ మంగళవారం అర్ధరాత్రి సమయంలో మృతి చెందారు. మృతుని భార్య సుగుణమ్మ ఫిర్యాదు మేరకు ఎస్సై యాదగిరి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీస్ ఇన్‌స్పెక్టర్ మన్మథకుమార్ తెలిపారు.

అందమైన ఉపాధి..!



హీరోయిన్ రితికా సింగ్‌కు మేకప్ చేస్తున్న నాగవెల్లి వెంకట్

మిర్యాలగూడ, న్యూస్‌టుడే:

జీవనోపాధి కోసం చేసే కుల వృత్తిని ఆధునిక అవసరాలకు తగిన విధంగా మెరుగు పరచుకుని.. తనదైనశైలిలో సెలబ్రిటీలకు, ప్రముఖులకు అందాలను మెరుగులద్దుతూ తాను ఉపాధి పొందుతూ మరో పది మందికి ఉపాధి కల్పిస్తున్నాడు మిర్యాలగూడ పట్టణానికి చెందిన 'వెంకీస్ హెయిర్ అండ్ బ్యూటీ ఫ్యామిలీ సెలూన్' నిర్వాహకుడు నాగవెల్లి వెంకట్.

★ పట్టణానికి చెందిన నాగవెల్లి రాము, లక్ష్మమ్మ దంపతుల కుమారుడు వెంకట్ డిగ్రీ చదువుతూనే పార్ట్‌టైం సెలూన్‌లో పనిచేసేవాడు. ఆధునిక హెయిర్ స్టైల్‌పై అవగాహన పెంపొందించుకున్న ఆయన డిగ్రీ పూర్తి కాగానే 2009లో హైదరాబాద్‌కు వెళ్లి 'మానియా', మిర్రర్ వంటి సంస్థల్లో చేరి శిక్షణ పొందాడు. 2014లో మిర్యాలగూడకు వచ్చి బబుల్స్‌ను ఏర్పాటు చేశాడు. ప్రస్తుతం వెంకీస్ పేరుతో మరో సెలూన్‌ను ఏర్పాటు చేశాడు. తనదైనశైలిలో ప్రముఖులకు, సెలబ్రిటీలకు, సినిమా హీరోలు, హీరోయిన్‌లకు హెయిర్ స్టైలిస్ట్, మేకప్ మెన్‌గా పనిచేస్తున్నాడు. మిర్యాలగూడలో తన సంస్థలో పది మంది నిరుద్యోగులకు ఉపాధి కల్పిస్తూ.. హైదరాబాద్‌కు వెళ్లి ఆర్డర్లపై వివాహాలు, సినిమా షూటింగ్‌లకు మేకప్‌మెన్‌గా పనిచేస్తున్నాడు. సినీ హీరో చిరంజీవి కుటుంబానికి మేకప్ మెన్‌గా పనిచేస్తున్న 'టీను'తో కలిసి నాగవెల్లి వెంకట్ పనిచేస్తున్నాడు. ఇప్పటి వరకు సానియా మీర్జా, పీ.వీ సింధూ, హీరోయిన్లు శివాత్మిక, రితికాసింగ్, నిత్యాశెట్టి, హీరోలు అడవిశేషు, సహాయ, సీరియల్ నటులకు సైతం మేకప్ చేస్తున్నాడు. ఆసక్తి కలిగిన యువతకు శిక్షణ ఇచ్చి వారిని ప్రోత్సహిస్తానని చెబుతున్నాడు నాగవెల్లి వెంకట్.

హాయిగా వెళ్లొచ్చిక..!



సూర్యాపేట బస్టాండ్‌లో బస్సు ఎక్కడానికి పోటీ పడుతున్న ప్రయాణికులు (పాతచిత్రం)

◆ **పండగ వేళ ఆర్టీసీ ముందస్తు రిజర్వేషన్**

భానుపురి, కుడకుడరోడ్డు(సూర్యాపేట), న్యూస్‌టుడే: దసరా పండగకు ప్రయాణికులను గమ్యస్థానాలకు చేరవేసేందుకు ఆర్టీసీ అధికారులు ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. సంస్థకు ఆదాయాన్ని పెంచటం, ప్రయాణికుల రద్దీని తట్టుకొని మెరుగైన సేవలందించాలనే సంకల్పంతో ప్రత్యేక బస్సులు నడుపుతున్నారు. పండగల నేపథ్యంలో విద్యా, ఉద్యోగ, వ్యాపార, వాణిజ్య అవసరాల నిమిత్తం ఎక్కడెక్కడో ఉన్నవారు సైతం తమ సొంత ఊరిబాట పడుతున్నారు. దీంతో ఉమ్మడి నల్గొండ జిల్లాలోని బస్టాండ్‌లలో ప్రయాణికుల రద్దీ కనిపిస్తోంది.

ఎంజీబీఎస్ నుంచి ప్రత్యేక బస్సులు..

దసరా వేడుకల సందర్భంగా ప్రయాణికులు ఇబ్బందులు పడకుండా జిల్లాకు చెందిన బస్సులే కాకుండా ఎంజీబీఎస్ (మహాత్మాగాంధీ బస్‌స్టేషన్) నుంచి 639 బస్సులను ఆర్టీసీ ఉన్నతాధికారులు ఉమ్మడి నల్గొండకు కేటాయించారు. ఈ నెల 15 వరకు బస్సులు ఆయా ప్రాంతాల్లో తిరగనున్నాయి. ప్రయాణికులు తమ గమ్యస్థానాలకు చేరుకునేందుకు ముందుగా ఆన్‌లైన్ రిజర్వేషన్ అవకాశం కల్పించారు. ప్రయాణికులు WWW.TGSRTCBUS.IN/ORS.WEB లో ముందస్తు టికెట్ రిజర్వేషన్ చేసుకొని తమ గమ్యస్థానాలకు సురక్షితంగా చేరుకోవచ్చు.

పర్యవేక్షణ ఇలా..


ప్రయాణికులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా అధికారులు అవసరమైన ఏర్పాట్లు చేస్తున్నారు. బస్టాండ్లను శుభ్రంగా ఉంచడంతోపాటు తాగునీటి వసతి కల్పిస్తున్నారు. డిప్యూటీ ఆర్‌ఎంలు, రీజియన్‌లోని డిపోల డీఎంలు, సూపర్‌వైజర్లు, ఇతర అధికారులు పర్యవేక్షణ చేపడుతున్నారు. రద్దీకి అనుగుణంగా బస్సులు నడిపేలా చర్యలు తీసుకుంటున్నారు.

సద్వినియోగం చేసుకోవాలి

– రాజశేఖర్, ఆర్‌ఎం, నల్గొండ

దసరా పండగ సందర్భంగా ప్రయాణికులు ఆర్టీసీ వెబ్‌సైట్‌లో టికెట్ రిజర్వేషన్ చేసుకోవాలి. ఎంజీబీఎస్ నుంచి ఉమ్మడి జిల్లాకు 639 బస్సులే కాకుండా జిల్లాకు చెందినవి 640 నడుస్తున్నాయి. ప్రయాణికులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలి.

పద్దు.. తారుమారు..!



నల్గొండ జిల్లా పరిషత్తు, న్యూస్‌టుడే: నల్గొండకు చెందిన నరేష్‌కుమార్ చిరు ఉద్యోగి. కొద్దిపాటి వేతనంతో కుటుంబ జీవనం సాగిస్తున్నారు. ప్రతి నెల ఇంటి అద్దె, పిల్లల ఫీజులు, ఇతర అవసరాలకు ప్రణాళిక పద్ధతిలో ఖర్చులు వెచ్చిస్తుంటారు. కొద్ది రోజులుగా, కూరగాయల ధరలతో లోటు బడ్జెట్ ఎదుర్కొంటున్నారు. గత వారం రోజుల్లోనే నిత్యావసర వస్తువుల ధరలు అమాంతం పెరగడంతో అదనంగా రూ.రెండు వేల నుంచి రూ.మూడు వేల వరకు ఆర్థిక భారం పెరగడంతో నరేష్ లాంటి మధ్య తరగతి కుటుంబాలు ఆర్థిక పరమైన ఇబ్బందులతో సతమతమవుతున్నాయి.

❐ దసరా పండగ వేళ బియ్యం, కూరగాయల ధరలు ఆకాశన్నంటుతున్నాయి. మార్కెట్లల్లో వ్యాపారులు, దళారుల రాజ్యం నడుస్తోంది. గడిచిన వారం రోజుల్లోనే టమాట ధర నాలుగు రెట్లు పెరిగింది. ఒక కిలో రూ.25 లభించగా, ప్రస్తుతం మార్కెట్లో కిలో రూ.100కు చేరుకుంది. దాని వెనుకాలే ఉల్లి, వెల్లుల్లితోపాటు మిగతా కూరగాయల ధరలు పరుగులు పెడుతున్నాయి. మరో పక్క సన్న బియ్యం క్వింటాల్ గత ఏడాది రూ.5600వరకు ఉండగా ప్రస్తుతం రూ.6200 నుంచి రూ.7 వేల వరకు మార్కెట్‌లో విక్రయిస్తున్నారు. ఇక కంది పప్పు, పెసర, శనగ పప్పులు ఒక కిలోపై రూ.5 నుంచి రూ.40 వరకు అదనంగా పెరిగాయి.

❐ పండగల సీజన్‌లో ఒక్కసారే నూనెల ధరలకు రెక్కలొచ్చాయి. గత నెలలో కిలో రూ.110 ఉన్న నూనె ప్రస్తుతం కిలో రూ.135 వరకు చేరింది. అంటే ఒక కిలోపై రూ.20 అదనంగా పెరిగింది. దీంతో 5 కిలోలు వాడుతున్న కుటుంబాలు 3 కిలోలకు తగ్గించుకోవాల్సిన దుస్థితి నెలకొంది. జిల్లాలో ఐదు లక్షలకు పైగా కుటుంబాలున్నాయి. నెలకు 2.5 లక్షల లీటర్ల నూనె వినియోగం ఉంటుందని వ్యాపారుల అంచనా. ఈ లెక్క ప్రకారం రూ.9 కోట్ల ఆర్థిక భారం పడుతుంది. పర్వదినాలు రావడంతో పిండి వంటలకు నూనె వినియోగం తప్పని సరి కావడంతో ఏం చేయాలన్న మీమాంసలో ప్రజలు పడిపోయారు.

అంతా చేరి..అమ్మను కొలిచి..!

దేవి నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా నవశక్తి యూత్ ఆధ్వర్యంలో నార్కట్‌పల్లిలోని వేణుగోపాలస్వామి గుడి దగ్గర నెలకొల్పిన అమ్మవారి విగ్రహం వద్ద బుధవారం మహిళలు కనకపూజ, పసుపు కుంకుమ పూజ నిర్వహించారు. – న్యూస్‌టుడే,నార్కట్‌పల్లి గ్రామీణం



ఆహ్లాదం.. ఆలయ నగరి



నారసింహుడి దర్శనానికి వచ్చే భక్తులను ఆహ్లాదకరమైన పరిసరాలు ఆహ్వానిస్తున్నాయి. చుట్టూ కొండల నడుమ పెద్దగుట్ట.. ఆ గుట్టపైనే భక్తుల బస కోసం ప్రత్యేక వసతుల ద్వారా నిర్మించనున్న ఆలయనగరి పచ్చదనంతో కనువిందుగొల్పుతోంది. పూల ప్రాంగణాలు ఆకట్టుకుంటున్నాయి. – న్యూస్‌టుడే, యాదగిరిగుట్ట

పంటల రక్షకులుగా..

డీలర్లకు శిక్షణ



కంపసాగర్ పరిశోధన కేంద్రంలో శిక్షణలో పాల్గొన్న శాస్త్రవేత్తలు, అధికారులు

నల్గొండ గ్రామీణం, న్యూస్‌టుడే: పంటల రక్షణలో ఎరువులు, పురుగు మందులు విక్రయించే డీలర్లు రైతులకు సలహాదారులుగా మారుతున్నారు. డీలర్లకు సరైన శిక్షణ అందిస్తే ఏ పంటలకు, ఎలాంటి ఎరువులు, ఎంత మోతాదులో ఇవ్వాలనే అవగాహన ఉంటుందని వ్యవసాయశాఖ భావించింది. నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ అగ్రికల్చర్ ఎక్స్‌టెన్షన్ మేనేజ్‌మెంట్ ఆధ్వర్యంలో డిప్లొమా ఇన్ అగ్రికల్చర్ ఎక్స్‌టెన్షన్ సర్వీసు ఫర్ ఇన్‌పుట్ డీలర్స్ (డీఏఈఎస్‌ఐ) కోర్సును కేంద్ర ప్రభుత్వం అందుబాటులోకి తెచ్చింది. శాస్త్రవేత్తలు, అనుభవం కలిగిన వ్యవసాయాధికారులతో ఏడాదిపాటు డీలర్లకు శిక్షణ అందివ్వనున్నారు.

◆ పంటల సాగులో మెలకువలు, తెగుళ్ల నివారణకు వ్యవసాయ శాఖ అధికారుల సలహాలు తీసుకోవాల్సి ఉండగా.. చాలా మంది రైతులు నేరుగా డీలర్లను ఆశ్రయిస్తున్నారు. వారు సూచించే మందులు కొనుగోలు చేసి వాడుతున్నారు. దీంతో శిక్షణ తరగతుల్లో విత్తనాలు, వాతావరణ పరిస్థితులు, తెగుళ్లు, వైరస్‌లు సోకే దశ తదితర అంశాలపై శాస్త్రవేత్తలు డీలర్లకు వివరిస్తారు. ఏడాదిలో 48 తరగతులు నిర్వహిస్తున్నారు. 8 రోజుల పాటు క్షేత్ర స్థాయి సందర్శనలు ఉంటాయి. 40 రోజులు వ్యవసాయ అంశాలపై తరగతులు బోధిస్తున్నారు.

◆ నల్గొండ జిల్లా కంపసాగర్ కేవీకే కేంద్రంలో, మల్లేపల్లిలో ప్రస్తుతం వ్యవసాయశాఖ పరిధిలోని డీలర్లకు శిక్షణ ఇస్తున్నారు. గతేడాది నుంచి వారానికి ఒక రోజు చొప్పున ప్రతి విడతలో 40 మంది డీలర్లకు శిక్షణ నిర్వహిస్తున్నారు. క్షేత్ర స్థాయి సందర్శనలో విత్తనోత్పత్తి, ఆధునిక వ్యవసాయ సాగు పద్ధతులపై అవగాహన కల్పిస్తున్నారు. గతంలో పురుగు మందుల డీలర్ల ధ్రువీకరణ పత్రం పొందాలంటే తప్పనిసరిగా డిగ్రీలో బీఎస్సీ (రసాయన శాస్త్రం) చేసిన వారికే అవకాశం ఉండేది. ప్రస్తుతం పది ఉత్తీర్ణత సాధించి లైసెన్సు కలిగిన డీలర్లు ఈ శిక్షణకు హాజరై పరీక్ష రాసి ఉత్తీర్ణత సాధిస్తే ధ్రువీకరణ పత్రం పొందవచ్చు.

దసరా తరువాత మరో రెండు బ్యాచ్‌లకు..

ఉమ్మడి జిల్లాలో నల్గొండలోని డీఏవో కార్యాలయంలో రెండు బ్యాచ్‌లకు శిక్షణ ప్రారంభిస్తారు. యాదాద్రి భువనగిరి, సూర్యాపేట జిల్లాలో ఒక్కో బ్యాచ్‌కు శిక్షణ నిర్వహిస్తారు. డీలర్ల శిక్షణకు రూ.10 వేలు, ఇతరులు శిక్షణ తీసుకుంటే రూ.20 వేలు ఫీజు చెల్లించాల్సి ఉంటుంది.

48 వారాలపాటు..

పాల్వాయి శ్రవణ్‌కుమార్, జిల్లా వ్యవసాయాధికారి, నల్గొండ

విత్తన, ఎరువుల డీలర్లకు పూర్తిస్థాయిలో శిక్షణ ఇచ్చేందుకు ప్రభుత్వం ఈ కోర్సు అమలు చేస్తోంది. ఏడాదికి 48 వారాలపాటు ఈ శిక్షణ ఉంటుంది. కోర్సు పూర్తి చేసిన వారు విత్తన, పురుగు మందుల లైసెన్సు తీసుకోవచ్చు. పంటల సాగులో తీసుకోవాల్సిన చర్యలపై విత్తన, ఎరువుల డీలర్లతో పాటు ఇతరులు పూర్తి స్థాయిలో శిక్షణ ఇచ్చేందుకు ప్రభుత్వం సిద్ధంగా ఉంది.

ధాన్యం కొనుగోళ్లలో సమస్యలా..
99634 07064

నల్గొండ గ్రామీణం, న్యూస్‌టుడే: రాష్ట్ర రోడ్లు, భవనాలు, సినిమాటోగ్రఫీ శాఖల మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి బుధవారం నల్గొండ సమీపంలోని ఆర్జాలబావి వద్ద ఏర్పాటు చేసిన కొనుగోలు ధాన్యం కేంద్రాన్ని ప్రారంభించారు. వానాకాలం ధాన్యానికి సంబంధించి రైతులకు ఏమైనా ఇబ్బందులు ఏర్పడినా, చెల్లింపుల్లో ఆలస్యమైనా జిల్లా పౌరసరఫరాల అధికారి కార్యాలయంలో ఏర్పాటు చేసిన కంట్రోల్ రూమ్ నెంబరు 9963407064కి ఫోన్ చేయాలని సూచించారు. పీఏసీఎస్ అధ్యక్షుడు నాగరత్నం రాజు అధ్యక్షత వహించగా.. అదనపు కలెక్టర్ జె. శ్రీనివాస్, డీఎస్‌వో వెంకటేశ్వర్లు, పౌరసరఫరా శాఖ డీఎం హరీష్, వ్యవసాయశాఖ జేడీ శ్రవణ్‌కుమార్, మార్కెటింగ్ ఏడీ ఛాయదేవి, డీఆర్‌డీవో శేఖర్‌రెడ్డి, మున్సిపల్ ఛైర్మన్ బుర్రి శ్రీనివాసరెడ్డి, వైస్ ఛైర్మన్ రమేష్ తదితరులు పాల్గొన్నారు.

చికెన్ ధరలు				
	ఫాంరేటు	114–00	డ్రెస్డ్	197–00
	రిటైల్	136–00	స్కిన్‌లెస్	224–00

గడువు పెంచారు..!



గోదాము ముందున్న బియ్యం లారీలు(పాత చిత్రం)

హుజూర్‌నగర్, న్యూస్‌టుడే: ఎట్టకేలకు కేంద్రం సీఎంఆర్ బియ్యం పెట్టేందుకు గడువు పెంచింది. ఈనెల 31 వరకు గడువు ఇచ్చింది. గతనెల 30 వరకు గడువు ఉన్నప్పటికీ వివిధ కారణాలతో మిల్లర్లు పూర్తి చేయలేకపోయారు. రాష్ట్ర ప్రభుత్వం సీఎంఆర్ బియ్యం పెట్టేందుకు గడువు ఇవ్వాలని కోరుతూ గత నెల 13నే కేంద్రానికి లేఖ రాసింది. ఇటీవలే భారత ఆహార సంస్థ.. సీఎంఆర్ బకాయి ఉన్న మిల్లుల్లో తనిఖీలు నిర్వహించి, గడువు పెంచి బియ్యం వసూలు చేయాలని నివేదిక ఇవ్వడంతో మరో నెల రోజులు గడువు పెంచింది. గతంలో 90 రోజులు గడువు పెంచిన ప్రభుత్వం ఈసారి ఒక నెల మాత్రమే అవకాశం ఇచ్చింది. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ అధికారులు ప్రస్తుతం పెడుతున్న సీఎంఆర్ బియ్యంపై గట్టి నిఘా ఉంచాలని, నిబంధనలకు అనుగుణంగా బియ్యం ఉండేలా చూడాలని, రేషన్ బియ్యం తిరిగి సీఎంఆర్‌కు రాకుండా అన్ని జాగ్రత్తలు తీసుకోవాలని తాజాగా ఇచ్చిన ఉత్తర్వులో పేర్కొన్నారు.

లక్ష్యం పూర్తికి అవకాశం.. ఎఫ్‌సీఐ అధికారులు ఇటీవల మూడు రోజుల్లో బకాయి మిల్లుల్లో తనిఖీలు నిర్వహించిన విషయం తెలిసిందే. మిల్లుల్లో ధాన్యం ఉన్నందున లక్ష్యాన్ని పూర్తి చేయవచ్చునన్న నివేదిక ఆధారంగానే గడువు పెంచారు. లక్ష్యాన్ని పూర్తి చేసేందుకు రోజువారీ లక్ష్యాలను పెట్టి వసూలు చేసేందుకు అధికారులు కసరత్తు చేస్తున్నారు. మరో వారంలో 2024-25 వానాకాలం సీజన్ ధాన్యం రాక ప్రారంభం అవుతుంది. కొన్న కొత్త ధాన్యాన్ని మిల్లులకు కేటాయించాలి. ప్రస్తుతం ఉన్న నిబంధన ప్రకారం బకాయి ఉన్న మిల్లులకు ధాన్యం ఇచ్చే అవకాశాలు లేవు. కాబట్టి మిల్లర్లు కూడా ఈసారి త్వరితగతిన తమ లక్ష్యాలను పూర్తి చేసే అవకాశం ఉంది.

జ్ఞాపకం.. ఆయన వ్యాపకం

★ 200 చరవాణి నంబర్లు ఏకబిగిన చెప్పడం ఈయన ప్రత్యేకత



జీడిపల్లి రాజిరెడ్డి

రాజపేట మండలం నెమిల గ్రామానికి చెందిన 77 ఏళ్ల వృద్ధుడు చదివింది కేవలం ఐదో తరగతే. అయినా ఏకబిగిన 200 చరవాణి నెంబర్ల వరకు ఎక్కడా చూడకుండా చెబుతుంటారు. తన చరవాణిలో ఇప్పటి వరకు ఒక్క నెంబరు కూడా నమోదు చేసుకోకపోవడం గమనార్హం. జిల్లా ఉన్నతాధికారులు మొదలుకుని ప్రజా ప్రతినిధులు, స్థానిక నాయకుల చరవాణి నెంబర్లను నోటికే చెప్పడం ఈయన ప్రత్యేకత. తన బంధువులు, గ్రామంలోని వారి నెంబర్లను కూడా ఇట్టే చెప్పేయగలరు. వ్యవసాయ సాగు పనికి ఉపయోగ పడే కూలీలవి, ఎరువుల దుకాణ యజమానులు, ట్రాక్టర్ల యజమానులు, డ్రైవర్లు, రైసుమిల్లు యజమానులవి గుర్తు పెట్టుకున్నారు. ఇటీవలనే మాజీలైన ఎంపీపీ, జడ్పీటీసీ సభ్యులవి, సర్పంచులు, ఎంపీటీసీ సభ్యులవి కళ్లుమూసుకుని టకటకా చెబుతూనే ఉంటారు రాజిరెడ్డి. తన బంధువులు, ప్రముఖుల ల్యాండ్ ఫోన్‌నెంబర్లను సైతం వివరిస్తుంటారు. ఎవరి నెంబర్‌నైనా ఒకసారి మననం చేసుకుంటే చాలు జీవిత కాలం గుర్తుండి పోతుందని అంటున్నారు రాజిరెడ్డి. గ్రామంలో ఏ ఆపద సమయంలోనైనా అత్యవసరంగా ఎవరి చరవాణి నెంబర్ కావాలన్నా ఈయనకు ఫోన్‌చేసి అడుగుతుంటారు. నెంబర్లు గుర్తుంచుకోవడం ఈయనకు దశాబ్దకాలంపైగా అలవాటైంది. పిల్లలు, మనవల పుట్టిన తేదీలు, పెళ్లిరోజులు, ఇతర కార్యక్రమాలు తేదీలను అలవోకగా చెబుతుంటారు.

◆ నెమిలకు చెందిన రాజిరెడ్డిది పూర్తిగా వ్యవసాయ ఆధారిత కుటుంబం. తనకున్న 14 ఎకరాలకు నాలుగు ఎకరాల్లో వరి, 6 ఎకరాల్లో పత్తి సాగును చేపడుతూ జీవనం సాగిస్తున్నాడు. భార్య ఆండాళు, కుమారులు నర్సింహారెడ్డి, రామకృష్ణారెడ్డి, కుమార్తె సుజాత ఉన్నారు. అందరికీ వివాహాలు జరిపించగా కుమారులు హైదరాబాద్‌లో ఉంటున్నారు. **–న్యూస్‌టుడే, రాజపేట, ఆలేరు.**

జాగ్రత్తలు పాటించకపోతే కఠిన చర్యలు



కోదాడ, న్యూస్‌టుడే: మాంసం విక్రయించే దుకాణంలో వేలాడదీసిన మాంసాన్ని కుక్క తిన్న ఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. స్థానికుల కథనం ప్రకారం.. పట్టణంలో ఓ మటన్ సెంటర్ దుకాణాదారుడు దుకాణం తెరిచి బయటకు వెళ్లాడు. ఎవరూ లేకపోవడంతో దుకాణానికి వేలాడదీసిన మాంసాన్ని కుక్క తింటుండగా ఓ స్థానికుడు వీడియో తీసి సామాజిక మాధ్యమాల్లో పోస్టు చేయడంతో అది వైరలైంది. దీంతో పురపాలక కమిషనర్ రమాదేవి, శానిటరీ ఇన్‌స్పెక్టర్ యాదగిరి బుధవారం దుకాణాన్ని పరిశీలించి సీజ్ చేశారు. దుకాణదారుడికి రూ.2,000 చలానా విధించారు. జాగ్రత్తలు పాటించకపోతే కఠిన చర్యలు తీసుకుంటామని కమిషనర్ దుకాణదారులను హెచ్చరించారు.

హైవేపై వాహనాల రద్దీ.. హోటళ్లు కిటకిట

చౌటుప్పల్‌గ్రామీణం, న్యూస్‌టుడే: దసరా సెలవులు రావడంతో రాజధాని హైదరాబాద్‌లో నివాసం ఉండే తెలుగు రాష్ట్రాల ప్రజలు సొంతూళ్ల బాట పడుతున్నారు. దీంతో హైదరాబాద్-విజయవాడ జాతీయ రహదారిపై వాహనాలు బారులు తీరుతున్నాయి. ప్రయాణికుల సంఖ్య పెరగడంతో హైవేపై ఉన్న హోటళ్లు, రెస్టారెంట్‌లకు గిరాకీ పెరిగింది. మార్గమధ్యలో ప్రయాణికులు హోటళ్ల వద్ద ఉదయం టిఫిన్, టీకీ, మధ్యాహ్నం భోజనానికి ఆగుతుండటంతో జాతీయ రహదారిపై ఉన్న హోటళ్లు కిటకిటలాడుతున్నాయి. వ్యాపారం కూడా సాధారణ రోజుల కంటే అధికంగా జరుగుతున్నట్లు హోటల్ నిర్వాహకులు చెబుతున్నారు. కొన్ని పేరొందిన హోటళ్లలో ప్రయాణికులకు సీట్లు లభించక, వాహనాల పార్కింగ్‌లో స్థలం లేకపోవడంతో వెనుదిరుగుతున్నారు.



విధుల్లోనే ప్రాణాలు విడిచిన పోలీసు



పుట్ట యాదగిరి

చౌటుప్పల్‌గ్రామీణం, న్యూస్‌టుడే: విధుల్లో ఉన్న పోలీసు గుండెపోటుతో ప్రాణాలను విడిచిన ఘటన యాదాద్రి భువనగిరి జిల్లా చౌటుప్పల్ మండలం పంతంగి టోల్‌ప్లాజా వద్ద బుధవారం ఉదయం చోటుచేసుకుంది. పోలీస్ ఇన్‌స్పెక్టర్ మన్మథకుమార్ తెలిపిన వివరాల ప్రకారం.. నల్గొండ జిల్లా కేంద్రంలోని నందీశ్వర్ కాలనీకి చెందిన పుట్ట యాదగిరి(59) తిప్పర్తి పోలీస్ స్టేషన్‌లో హెడ్ కానిస్టేబుల్‌గా పని చేస్తున్నారు. పంతంగి నుంచి టేకుమట్ల వరకు హైవే పెట్రోలింగ్ వాహనంపై యాదగిరి పని చేస్తారు. హైదరాబాద్-విజయవాడ జాతీయ రహదారిపై వీఐపీలు వెళ్లేటప్పుడు వారి రాకపోకలకు ఇబ్బందులు తలెత్తకుండా ఈ పెట్రోలింగ్ వాహనంపై పని చేసేవారు చూస్తారు. బుధవారం ఉదయం ఏపీకి చెందిన ఓ మంత్రి హైదరాబాద్ నుంచి ఏపీకి వెళ్తుండటంతో బుధవారం ఉదయం 7:30 నిమిషాలకు పెట్రోలింగ్ వాహన సిబ్బంది పంతంగి టోల్‌ప్లాజా వద్దకు చేరుకున్నారు. యాదగిరి మూత్రవిసర్జనకు వెళ్లి అక్కడే కుప్పకూలిపోవడంతో తోటి పోలీసులు గమనించి వెంటనే చౌటుప్పల్ ప్రభుత్వాసుపత్రికి తరలించారు. అప్పటికే యాదగిరి మృతి చెందినట్లు వైద్యులు తెలిపారు. మృతదేహానికి స్థానిక ప్రభుత్వాసుపత్రిలో పోస్టుమార్టం నిర్వహించారు. మృతుడికి భార్య, ఇద్దరు కుమార్తెలు, కుమారుడు ఉన్నారు. ఎస్సై లక్ష్మయ్య కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఇన్‌స్పెక్టర్ పేర్కొన్నారు.

గౌరమ్మను పూజించి.. ఆశీస్సులు ఆకాంక్షించి

నల్గొండ లీగల్, న్యూస్‌టుడే: న్యాయశాఖ ఆధ్వర్యంలో బుధవారం జిల్లా కోర్టు ప్రాంగణంలో బతుకమ్మ పండగను ఉద్యోగులు ఘనంగా నిర్వహించారు. కార్యక్రమానికి జిల్లా జడ్జి నాగరాజు తన కుటుంబంతో సహా పాల్గొని పూజలు నిర్వహించారు. జిల్లాజడ్జి మాట్లాడుతూ.. తెలంగాణ ప్రాముఖ్యాన్ని బతుకమ్మ చాటుతుందని, న్యాయశాఖ ఉద్యోగులు బతుకమ్మ పండగను ఇక్కడ నిర్వహించడం ఎంతో అభినందనీయమన్నారు. అమ్మవారి ఆశీస్సులు అందరికీ లభించాలని ఆయన ఆకాంక్షించారు.

❐ న్యాయమూర్తి కుమార్తె రిత్విక ఉద్యోగులతో కలిసి బతుకమ్మను కీర్తిస్తూ పాటలు పాడటం అందరిని ఆకర్షించింది. అందంగా అలంకరించిన బతుకమ్మలకు జిల్లాజడ్జి నాగరాజు బహుమతులను అందజేశారు. జిల్లా న్యాయశాఖ ఉద్యోగ సంఘ అధ్యక్షుడు మాతంగి వీరబాబు, సభ్యులు గిరి, ఉషారాణి, లతీఫ్, రాంబాబు, వెంకటమ్మ, సరిత, సంధ్య తదితరులు పాల్గొన్నారు.



బతుకమ్మలతో ఉన్న గౌరమ్మకు పూజలు నిర్వహిస్తున్న జిల్లాజడ్జి నాగరాజు

కోదాడ

●కోదాడ ●హుజూర్‌నగర్

క్రీడలతో స్నేహభావం



నడిగూడెం, న్యూస్‌టుడే: క్రీడలు యువతలో స్నేహభావాన్ని పెంపొందిస్తాయని ఎస్సై అజయ్‌కుమార్ అన్నారు. బుధవారం నడిగూడెం జూనియర్ కళాశాల మైదానంలో వాలీబాల్ పోటీలు ప్రారంభించారు.

పరిశీలన

హుజూర్‌నగర్, న్యూస్‌టుడే: పట్టణంలో వివిధ కాలనీలలో మంత్రి ఉత్తమ్‌కుమార్ రెడ్డి సహకారంతో రూ.3కోట్ల అభివృద్ధి పనులు జరుగుతున్నాయని పుర వైస్ ఛైర్మన్ సంపత్‌రెడ్డి తెలిపారు. 3వ వార్డులో జరుగుతున్న అభివృద్ధి కార్యక్రమాలను బుధవారం పరిశీలించారు.

మేమున్నాం.. మీకు తోడుగా.. (10 AM TO 1 PM) 80085 50363 96030 18889

కోదాడ పట్టణం, న్యూస్‌టుడే:

? రాంమూర్తినగర్‌లో వీధిదీపాలు వెలగడం లేదు. రాత్రి వేళల్లో విషసర్పాలు వస్తున్నాయి. చిన్నపిల్లలు, వృద్ధులు ఇబ్బందులు పడుతున్నారు. –నరేష్, కోదాడ

✔ పరిశీలించి వెంటనే వీధి దీపాలు అమర్చుతాం. –నాగరాజు, ఎలక్ట్రీషియన్, పురపాలక సంఘం

ఆధునిక వ్యవసాయ పద్ధతులలో పంటలు సాగు చేయాలి



డ్రోన్ సహాయంతో మందు పిచికారీని పరిశీలిస్తున్న వ్యవసాయ అధికారి శ్రీధర్, రైతులు

చిలుకూరు: రైతులు ఎప్పటికప్పుడు కాలానుగుణంగా ఆధునిక వ్యవసాయ పద్ధతులపై ఆసక్తి చూపాలని మండల వ్యవసాయ అధికారి శ్రీధర్ అన్నారు. మండల కేంద్రానికి చెందిన కొడారు లక్ష్మయ్య అనే రైతు తన వ్యవసాయ పొలంలో నూతనంగా డ్రోన్ సహాయంతో మందును పిచికారీ చేయడాన్ని ఆయన పరిశీలించారు. పలువురు రైతులు ఆసక్తిగా తిలకించారు. కిసాన్ సెల్ మండల అధ్యక్షుడు వెంకటయ్య, రైతులు పాల్గొన్నారు.

గిరిజన రైతులకు ఎరువుల పంపిణీ

గరిడేపల్లి, న్యూస్‌టుడే: సమీకృత వ్యవసాయ విధానాల ద్వారా గిరిజన రైతుల జీవనోపాధి మెరుగుపడుతుందని కేవీకే ఇన్‌ఛార్జి డి.నరేష్ అన్నారు. గిరిజన ఉప ప్రణాళికలో భాగంగా గిరిజన రైతులకు జీవన ఎరువులు పంపిణీ చేశారు. సేంద్రియ వ్యవసాయంతో వాతావరణ సమతుల్యం పాటించడం వల్ల నాణ్యమైన దిగుబడులు పొందవచ్చని పేర్కొన్నారు. లబ్ధిదారులకు అజోస్పిరిల్లం, ఫాస్ఫోబ్యాక్టీరియా, పొటాషియం, బ్యాక్టీరియా, జీవ శిలీంధ్రనాశనులైన ట్రైకోడెర్మావిరిడి, సుడోమోనాస్ పంపిణీచేశారు. శాస్త్రవేత్తలు కిరణ్, మాధురి, సుగంధి, పాల్గొన్నారు.

కష్టాల కడలి దాటి.. కొలువు తీరం చేరి

మండలంలోని పలువురు డీఎస్సీ-24లో ప్రభుత్వ ఉపాధ్యాయ ఉద్యోగాలకు అర్హత సాధించి నియామక పత్రాలు అందుకున్నారు. కొలువు సాధించాలంటే ప్రస్తుత పోటీ సమాజంలో దాదాపు అన్నింటిని వదులుకొని సన్నద్ధమవ్వాలి. అలా కష్టపడి తమ కలల కొలువు సాధించారు.

చిలుకూరు, న్యూస్‌టుడే:

ఇల్లు తాకట్టు పెట్టి..



బేతవోలుకు చెందిన **నెమ్మాది సతీష్** స్థానిక ప్రభుత్వ పాఠశాలలోనే విద్య అభ్యసించారు. తల్లి కుమారి, తండ్రి కాశయ్యలు కష్టపడి చదివించారు. తాను ఉద్యోగాన్ని సాధించడానికి డబ్బులు లేక ఉన్న ఇంటిని తాకట్టు పెట్టి సన్నద్ధమైనట్లు ఆయన చెప్పారు. పడిన శ్రమకు గుర్తింపుగా ఉద్యోగం వచ్చిందని పేర్కొన్నారు. ఉద్యోగం సాధించడంతో కుటుంబ సభ్యులు ఆనందం వ్యక్తం చేశారు.

భార్య సహకారంతో..



బేతవోలుకు చెందిన **రెమిడాల సైదులు** ప్రాథమిక విద్య మొత్తం ప్రభుత్వ పాఠశాలలోనే అభ్యసించారు. తొమ్మిదో తరగతిలోనే తల్లి మరియమ్మ, ఆ తరువాత తక్కువ వ్యవధిలోనే తండ్రి గోపయ్య అనారోగ్యంతో మరణించారు. దీంతో నానమ్మ ఈదమ్మ, బాబాయ్ తిరపయ్య సహకారంతో ఇంటర్, డీగ్రీ పూర్తి చేసిన సైదులు ఆ తరువాత ఎమ్మెస్సీ, ఎంఈడీ లాంటి విద్యార్హతలు సాధించారు. ఇలా చదువుకుంటూనే వివాహం చేసుకొన్నారు. డీఎస్సీకి సన్నద్ధమవుతూనే 2018-21 వరకు నల్గొండ జిల్లా శాలిగౌరారంలో ఓ కంపెనీలో మేనేజర్‌గా ఉద్యోగం చేశాడు. అనంతరం భార్య విజయలక్ష్మి సహకారంతో చివరి ప్రయత్నం చేసి ఉద్యోగం సాధించారు. మేనబావ ముత్తు, స్థానిక ఉన్నత పాఠశాల ఉపాధ్యాయుడు అంకిరెడ్డిల ప్రోత్సాహంతో ఈ ఉద్యోగాన్ని సాధించినట్లు ఆనందం వ్యక్తం చేశారు.

పేదరికంలో పుట్టి.. ప్రతిభావంతుడిగా ఎదిగి



మఠంపల్లి, న్యూస్‌టుడే: పేదరికంలో పుట్టి ప్రభుత్వ బడులలో విద్యను అభ్యసించి, డిగ్రీ, పీజీ కేయూ, ఓయూ ప్రవేశ పరీక్షలో ర్యాంకులు పొంది ప్రతిభ ఆధారంగా ఇచ్చే ఉపకార వేతనాలతో చదువు పూర్తిచేశారు. కొలువుల కోసం నిర్వహించిన పోటీ పరీక్షల్లోనూ సత్తా చాటి ఉపాధ్యాయ, హెచ్‌డబ్ల్యూవో ఉద్యోగాలకు ఎంపికయ్యారు. ప్రస్తుత డీఎస్సీలో సూర్యాపేట జిల్లా స్థాయిలో 19వ ర్యాంకును సాధించి స్కూల్ అసిస్టెంట్(సోషల్ స్టడీస్)గా బుధవారం నియామక పత్రాన్ని అందుకున్నారు. మఠంపల్లికి చెందిన బండ్ల కోటమ్మ, అంకాలు నిరుపేదలు. రెక్కల కష్టంతో కుటుంబాన్ని పోషించుకుంటూనే కుమారుడు **గురుప్రసాద్‌**ను చదివించారు. స్థానిక పీఎస్, జడ్పీ ఉన్నత పాఠశాలల్లో వసతి గృహాల్లో ఉంటూ ఉన్నత విద్యలు కొనసాగించిన ఆయన పీజీ సెట్‌లో కేయూలో ప్రథమ, ఓయూలో ద్వితీయ, లాసెట్‌లో రాష్ట్ర స్థాయిలో 58, బీఎడ్‌లో 72వ ర్యాంకులు సాధించుకున్నారు. పీజీ ఎకనామిక్స్, బీఎడ్ ఓయూలో చదివిన గురుప్రసాద్ ఎంఎడ్ ప్రస్తుతం ఇక్కడే చదువుతున్నారు.

పిడుగుపాటుకు 12 మేకల మృతి

★ కాపరులకు త్రుటిలో తప్పిన ప్రమాదం

నేరేడుచర్ల, న్యూస్‌టుడే: పులగంబండతండా పంచాయతీ పరిధిలోని మూసిఒడ్డుతండాలో పిడుగుపాటుకు 12 మేకలు మృత్యువాతపడ్డాయి. నేరేడుచర్ల మండలంలో బుధవారం సాయంత్రం భారీ శబ్దాలతో కూడిన ఉరుములతో వర్షం పడింది. ఆసమయంలో మూసొడ్డుతండా పరిసరాల్లో పొలాల్లో మేస్తున్న మేకలు వర్షం పడుతుండడంతో చెట్లకిందకు వెళ్లిన సమయంలో పిడుగుపడడంతో మేకలు చనిపోయాయి. మేకల కాపరులు వాటికి కొంచెం దూరంలో ఉన్న సమయంలో పిడుగుపడడంతో వారు తృటిలో ప్రమాదం నుంచి తప్పించుకున్నారు. వారికి కరెంట్‌షాక్ కొట్టినట్లుగా అనిపించినట్లు తెలిపారు. ఆసమయంలో మొత్తం 27 మేకలు ఉండగా 12 మృతిచెందాయి. చనిపోయిన మేకల్లో బానోతు బాలుకి చెందినవి 10, బానోతు హేమ్లా, బానోతు సైదాకి చెందిన ఒక్కో మేక ఉన్నాయి. వీటి విలువ రూ.2 లక్షల దాకా ఉంటుందని వారు చెప్పారు. రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ నర్సయ్య గ్రామానికి వెళ్లి విచారణ జరిపారు.

ఆకలి తీర్చుకుంటున్న ఆవుపై..

మేళ్లచెరువు: అడవిలో మేత మేస్తున్న ఓ ఆవు పిడుగుపాటుతో ప్రాణాలు కోల్పోయిన ఘటన రేవూరులో బుధవారం జరిగింది. జువ్వెనబోయిన కొండలు అనే రైతు తనకున్న రెండు ఆవులతో పొలంలో ఉదయం అరక దున్నాడు. మధ్యాహ్నం అరక విడిచి మేతకు వదిలారు. ఇంతలో మబ్బులు పట్టి ఒక్కసారిగా మేత మేస్తున్న ఒక ఆవుపై పిడుగుపడి అక్కడికక్కడే ప్రాణాలు కోల్పోయింది. తనకు అతి సమీపంలోనే పిడుగుపాటుకు గురై తన ఆవు ప్రాణాలు కోల్పోవడంతో కొండలు హతాశుడైయ్యారు. ఉన్న రెండు ఆవుల్లో ఒకదానిని కోల్పోవడంతో బాధిత రైతు కన్నీరు మున్నీరయ్యారు. రైతును ప్రభుత్వం ఆదుకోవాలని స్థానిక నాయకుడు గుర్వయ్య కోరారు.

కోర్టు ఏపీపీగా వెంకటేశ్వర్లు

కోదాడ న్యూస్‌టుడే: కోదాడ కోర్టు ఏపీపీ(అదనపు పబ్లిక్ ప్రాసిక్యూటర్)గా పట్టణానికి చెందిన న్యాయవాది సిలివేరు వెంకటేశ్వర్లు నియమితులయ్యారు. ఈ మేరకు బుధవారం ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. ఈ సందర్భంగా వెంకటేశ్వర్లు మాట్లాడుతూ 1995 నుంచి కోదాడలో న్యాయవాదిగా పని చేస్తున్నానని, ఏపీపీగా అట్టడుగు స్థాయి ప్రజలకు కూడా న్యాయ సేవలు అందిస్తానన్నారు.

శాంతిభద్రతలకు విఘాతం కలిగిస్తే చర్యలు

మేళ్లచెరువు, న్యూస్‌టుడే: దసరా సందర్భంగా ఉత్సవాల పేరుతో శాంతి భద్రతలకు విఘాతం కలిగిస్తే చట్టపరమైన చర్యలు తప్పవని డీఎస్పీ శ్రీధర్‌రెడ్డి అన్నారు. దసరా వేడుకల నిర్వహణ, సైబర్ క్రైంలపై రామాపురంలో బుధవారం నిర్వహించిన అవగాహన సదస్సులో ఆయన మాట్లాడారు. దసరా వేడుకల్లో ఏ వేదికలోనూ డీజేలు వాడొద్దన్నారు. ఈ నిబంధనను ఉల్లంఘిస్తే కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు. సైబర్ నేరగాళ్లు యువతను లక్ష్యంగా చేసుకుని రకరకాలుగా వంచించేందుకు ప్రయత్నిస్తున్నారని, వారి వలలో పడొద్దని సూచించారు.



రామాపురంలో మాట్లాడుతున్న డీఎస్పీ శ్రీధర్‌రెడ్డి

మంచినీటి సహాయకులు సమర్థంగా పని చేయాలి

చిలుకూరు, న్యూస్‌టుడే: మిషన్ భగీరథ ఆర్‌డబ్ల్యూఎస్ విభాగంలో పని చేసే మంచినీటి సహాయకులు సమర్థంగా పని చేయాలని ఎంపీడీవో గిరిబాబు సూచించారు. మండల కేంద్రంలోని రైతువేదికలో చిలుకూరు, హుజూర్‌నగర్ మండలాలలో మిషన్‌భగీరథ స్కీంలో పని చేసే మంచినీటి సహాయకులకు నాలుగు రోజుల పాటు జరగనున్న శిక్షణ కార్యక్రమాన్ని ఆయన బుధవారం ప్రారంభించారు. అనంతరం క్షేత్రస్థాయిలో పని చేసే విధానాలపై వారికి శిక్షణ ఇచ్చారు. ఎంపీవో జగదీష్, ఏఈ నాగులు, చిలుకూరు గ్రామ పంచాయతీ కార్యదర్శి షరీఫుద్దీన్ పాల్గొన్నారు.

అర్హులకు ప్రభుత్వ పథకాలు అందేలా కృషి

హుజూర్‌నగర్ గ్రామీణం, న్యూస్‌టుడే: అర్హులైన వారందరికీ ప్రభుత్వ పథకాలు అందేలా చేస్తామని కాంగ్రెస్ పార్టీ పట్టణ అధ్యక్షుడు తన్నీరు మల్లికార్జున్‌రావు అన్నారు. ఇందిరా భవన్‌లో బుధవారం నిర్వహించిన వీధి పండ్ల దుకాణాల యూనియన్ సర్వసభ్య సమావేశంలో మాట్లాడారు. వీధి పండ్ల దుకాణాల సమస్యలను మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించేందుకు కృషి చేస్తామన్నారు. ఫణిగిరి గుట్ట వద్ద నిర్మిస్తున్న మోడల్ కాలనీలో అర్హులకు ఇళ్ల మంజూరయ్యేలా చూస్తామన్నారు.

పూలతో తలచి.. పాటలతో కొలిచి

న్యూస్‌టుడే బృందం: బతుకమ్మ వేడుకలను ఆనందోత్సాహాల నడుమ బుధవారం జరుపుకొన్నారు. అందంగా పేర్చిన బతుకమ్మలను తీసుకువచ్చి ప్రాంగణంలో ఉంచారు. బతుకమ్మల చుట్టూ తిరిగి పాటలు పాడుతూ అలరించారు. కోదాడ ఆర్టీసీ డిపోలో మహిళా ఉద్యోగులు బతుకమ్మ వేడుకలు జరుపుకొన్నారు.



నేరేడుచర్ల: పెంచికల్‌దిన్న ప్రాథమిక ఆరోగ్యకేంద్రంలో బతుకమ్మలతో వైద్యాధికారిణి డి.సౌమ్యశ్రీ, ఉద్యోగులు

మునగాల: మండల కేంద్రంలోని కనకదుర్గమ్మ దేవాలయం, హనుమాన్ దేవాలయంలో బతుకమ్మ ఆడే ప్రదేశాలను, ఊరచెరువు వద్ద నిమజ్జనం చేసే ప్రదేశాలను ఎస్సై ప్రవీణ్‌కుమార్, తహసీల్దార్ ఆంజనేయులు, ఎంపీడీవో రమేష్ దీన్‌దయాల్ పరిశీలించారు.



హుజూర్‌నగర్ గ్రామీణం: వేపలసింగారంలోని మిట్టగూడెం ప్రాథమిక పాఠశాలలో ఏర్పాటు చేసిన బతుకమ్మ ఉత్సవాలలో జబర్దస్త్ కళాకారులు వినోదిని, శాంతి స్వరూప్, మోహన్ పాల్గొని గ్రామస్థులతో కలిసి ఆడిపాడారు.

సినిమాలు కోదాడ పట్టణం, న్యూస్‌టుడే:

విష్ణురామ్: దేవర, వేట్టయన్, **శ్రీనివాస:** దేవర, **కాన్‌ప్లెక్స్:** వేట్టయన్, **రంగా:** వేట్టయన్

పీఆర్టీయూ రాష్ట్ర కార్యవర్గంలో స్థానం

నేరేడుచర్ల, న్యూస్‌టుడే: పీఆర్టీయూ రాష్ట్ర కార్యవర్గంలో మండలంలోని పలువురు ఉపాధ్యాయులకు స్థానం దక్కినట్లు ఆ సంఘం బుధవారం ఒక ప్రకటనలో తెలిపింది. రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షులుగా శ్రీనివాసరెడ్డి, కట్ల శ్రీనివాసరెడ్డి, సైదులు, రాష్ట్ర ఉపాధ్యక్షులుగా దీప్లానాయక్, ఉమాపతిరెడ్డి, రాష్ట్ర కార్యదర్శిగా శ్రీనివాస్ ఎన్నికయ్యారు.

మునగాల: పీఆర్‌టీయూ రాష్ట్ర ఉపాధ్యక్షుడిగా పందిరి బ్రహ్మారెడ్డి, రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షులుగా శ్రీనివాసరెడ్డి, వెంకటేశ్వరరావు, శ్రీనివాస్, రంగారావులు ఎన్నుకయ్యారు. మండల కేంద్రంలో బుధవారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో రాష్ట్ర ఉపాధ్యక్షుడు పందిరి బ్రహ్మారెడ్డి మాట్లాడారు.


కోదాడ పట్టణం: పీఆర్‌టీయూ రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షులుగా కోదాడకు చెందిన రంగారావు, ప్రభాకర్‌రావు, రాష్ట్ర ఉపాధ్యక్షుడిగా వెంకటేశ్వర్లుకు ఆ యూనియన్ రాష్ట్ర అధ్యక్షుడు శ్రీపాల్‌రెడ్డి నియామక పత్రాలను అందించారు.

హుజూర్‌నగర్: రాష్ట్ర పీఆర్టీయూ టీఎస్ అసోసియేట్ అధ్యక్షుడిగా రెండోసారి మాతంగి ప్రభాకర్ ఎన్నికయ్యారు. హుజూర్‌నగర్ ప్రభుత్వ ఉన్నత పాఠశాలకు చెందిన ప్రభాకర్‌రావు రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షుడిగా ఎన్నికయ్యారు.

నడిగూడెం: పీఆర్టీయూ అసోసియేట్ అధ్యక్షుడిగా సామినేని శ్రీనివాసరావు, రాష్ట్ర ఉపాధ్యక్షులుగా బి. చంద్రారెడ్డి, కె.నాగేశ్వరరావులు ఎన్నికైనట్లు బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు.

నియామక పత్రాల అందజేత

హైదరాబాద్ ఎల్బీ స్టేడియంలో బుధవారం జరిగిన కార్యక్రమంలో కొత్త ఉపాధ్యాయులకు సీఎం రేవంత్‌రెడ్డి, మంత్రులు నియామకపత్రాలను అందజేశారు. – ఈనాడు, హైదరాబాద్



గాలి కరుణాకర్‌రెడ్డికి నియామక పత్రం అందజేస్తున్న రాజ్యసభ సభ్యుడు అభిషేక్ మను సింఘ్వీ

ఎత్తిపోతలను రద్దు చేయాలని వినతి



ఆర్డీవోకు వినతి పత్రం ఇస్తున్న వెల్లటూరు-ఎంబీ కెనాల్ ఎత్తిపోతల భూ నిర్వాసితులు

హుజూర్‌నగర్ గ్రామీణం, న్యూస్‌టుడే: వెల్లటూరు-ముక్త్యాల బ్రాంచ్ కెనాల్ ఎత్తిపోతల పథకాన్ని రద్దు చేసి, ఆ పథకం పరిధిలో ఉన్న రైతులను ఆదుకోవాలని వెల్లటూరు-ఎంబీ కెనాల్ ఎత్తిపోతల భూ నిర్వాసితులు కోరారు. ఆర్డీవో కార్యాలయంలో ఆర్డీవో శ్రీనివాసులును కలిసి బుధవారం వినతి పత్రం అందజేశారు. ఈ పథకాన్ని రద్దు చేయాలని అనేకమార్లు నిరసనలు, ధర్నాలు చేశామన్నారు. ఈ భూములన్నీ మెట్ట పంటలకు అనుకూలమైనవని, వీటి కోసం మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి గతంలోనే 16 చిన్న, పెద్ద తరహా ఎత్తిపోతల పథకాలను కృష్ణపట్టె ప్రాంతానికి సాధించి పెట్టారని వివరించారు. కొత్తగా మంజూరైన ఎత్తిపోతల పథకాన్ని వెంటనే రద్దు చేసి రైతులకు సహకరించాలని కోరారు. లక్ష్మారెడ్డి, శ్రీనివాసరెడ్డి, వెంకటరెడ్డి, మౌలాలి, వెంకటాచారి, తదితరులు పాల్గొన్నారు.

ఆసుపత్రిలో కాన్పులు అయ్యేలా చూడాలి

హుజూర్‌నగర్ గ్రామీణం, న్యూస్‌టుడే: ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో సాధారణ కాన్పులు అయ్యేలా చూడాలని జిల్లా వైద్యాధికారి డాక్టర్ కోటాచలం అన్నారు. లింగగిరి గ్రామంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని బుధవారం పరిశీలించారు. ఆరోగ్య సిబ్బంది సమయ పాలన పాటించి ప్రజలకు అందుబాటులో ఉండాలని, లేని పక్షంలో చర్యలు తప్పవని హెచ్చరించారు. పీహెచ్‌సీలో నిర్వహించాల్సిన రికార్డులు పరిశీలించారు. ఆరోగ్య కేంద్రం పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు. కార్యక్రమంలో డిప్యూటీ డీఎంహెచ్‌వో చంద్రశేఖర్, జిల్లా స్టాటిస్టిక్స్ అధికారి వీరయ్య, సీహెచ్‌సీ వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

హైదరాబాద్‌కు తరలిన డీఎస్సీ అభ్యర్థులు

కోదాడ పట్టణం, న్యూస్‌టుడే: హైదరాబాద్‌లోని ఎల్‌బీ స్టేడియంలో డీఎస్సీ అభ్యర్థులకు సీఎం రేవంత్ రెడ్డి చేతుల మీదుగా నియామక పత్రాలు అందజేసే సందర్భంగా ప్రభుత్వ ఆదేశాల మేరకు కోదాడ నుంచి అధికారులు అభ్యర్థులను బుధవారం బస్సుల్లో తరలించారు. ఈ సందర్భంగా హైదరాబాద్‌కు వెళుతున్న బస్సులను జిల్లా పంచాయతీ అధికారి నారాయణరెడ్డి, తహసీల్దార్ వాజిద్‌అలీ, ఎంఈవో సలీంషరీఫ్‌లు ప్రారంభించారు. కోదాడ డివిజన్ నుంచి 95 మంది అభ్యర్థులను రెండు బస్సుల్లో పోలీస్ ఎస్కార్ట్‌తో తరలించినట్లు వారు తెలిపారు. ఎంఈవోలు శ్రీనివాసరావు, గురవయ్య, ఉపేందర్‌రావు, వెంకటేశ్వర్లు, తదితరులున్నారు.



జెండా ఊపి బస్సులను ప్రారంభిస్తున్న జిల్లా పంచాయతీ అధికారి నారాయణరెడ్డి, ఎంఈవోలు తదితరులు

విద్యుదాఘాతంతో తీవ్ర గాయాలు

మునగాల, న్యూస్‌టుడే: విద్యుదాఘాతంతో వ్యక్తికి తీవ్ర గాయాలైన ఘటన మండల కేంద్రంలో బుధవారం చోటుచేసుకుంది. స్థానికుల కథనం ప్రకారం.. మునగాల గ్రామానికి చెందిన సైదులు కాంట్రాక్ట్ పనుల్లో భాగంగా గ్రామంలో వీధి దీపాలు వేస్తున్నారు. పనుల్లో భాగంగా విద్యుత్తు స్తంభం ఎక్కగా, సమీపంలోని వ్యవసాయ సంబంధిత విద్యుత్తు లైన్లు (11కేవీ) నుంచి రివర్స్ సప్లై కావడంతో విద్యుదాఘాతానికి గురై కింద పడటంతో తలకు తీవ్ర గాయాలయ్యాయి. స్థానికులు సీపీఆర్ చేసి 108 అంబులెన్స్‌కు సమాచారం అందించారు. అంబులెన్స్‌లో జిల్లా ఏరియా వైద్యశాలకు, మెరుగైన వైద్యసేవల నిమిత్తం హైదరాబాద్‌కు తరలించారు.

విశ్రాంత ఉద్యోగి కన్నుమూత



లింగయ్య

హుజూర్‌నగర్, న్యూస్‌టుడే: హుజూర్‌నగర్ విశ్రాంత ఉద్యోగుల సంఘ సభ్యుడు పోతురాజు లింగయ్య(72) బుధవారం మరణించారు. కొంతకాలంగా ఆయన అనారోగ్య సమస్యలతో బాధపడుతున్నారు. తెరాసకేవీ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్, ట్రాన్స్‌కో ఉద్యోగుల సంఘం నాయకుడు పోతురాజు రమేష్ లింగయ్య కుమారుడు. విశ్రాంత ఉద్యోగుల సంఘం నాయకులు, పలువురు ట్రాన్స్‌కో అధికారులు, ఉద్యోగులు, ట్రాన్స్‌కో ఉద్యోగ సంఘాల నాయకులు లింగయ్య మృతదేహంపై పూలమాల ఉంచి నివాళులు అర్పించారు.

అక్షరాభ్యాసాలు.. అన్నదానాలు

కోదాడలోని కేఎల్ఆర్ కాలనీలో పూజల అనంతరం చిన్నారులు







కోదాడ: శ్రీవీరబ్రహ్మేంద్రస్వామి దేవాలయంలోని జ్ఞానసరస్వతి ఆలయంలో పూజలు నిర్వహిస్తున్న భక్తులు

మేళ్లచెరువులో..



హుజూర్‌నగర్: సీతారాంనగర్ అమ్మవారి మండపం వద్ద పురుషోత్తంరెడ్డి జ్ఞాపకార్థం అన్నదాన కార్యక్రమం

న్యూస్‌టుడే బృందం: అమ్మవారు ఏడో రోజు సరస్వతి దేవిగా ప్రత్యేక అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు. హుజూర్‌నగర్ పట్టణంలోని సీతారాంనగర్ రామాలయం వద్ద కుంకుమ పూజ, చండీయాగం నిర్వహించారు. అనంతరం మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి తండ్రి పురుషోత్తంరెడ్డి జ్ఞాపకార్థం అన్న సంతర్పణ నిర్వహించారు. మఠంపల్లి కనకదుర్గాదేవి ఆలయంలో చిన్నారులకు సామూహిక అక్షరాభ్యాసాలు జరిగాయి. కోదాడలోని పలు కాలనీల్లో అన్నదాన కార్యక్రమాలు నిర్వహించారు.

'ఖాతాల్లో జమకాని వరద సాయం'

కోదాడ పట్టణం, న్యూస్‌టుడే: తుపాను సృష్టించిన బీభత్సం కారణంగా బాధితులకు ప్రభుత్వం నష్టపరిహారం బ్యాంకులలో జమ చేస్తామని చెప్పి, నేటికి అమలు చేయడం లేదని సామాజిక ఉద్యమకర్త సయ్యద్ బషీరుద్దీన్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. బ్యాంకుల, అధికారుల చుట్టూ తిరుగుతున్నా పరిహారం అందడం లేదన్నారు. అధికారులు స్పందించి వెంటనే సాయం అందించాలన్నారు.

ధ్యానంతో మానసిక వికాసం

నడిగూడెం, న్యూస్‌టుడే: నిత్యం ధ్యానం చేయడం వల్ల మానసిక వికాసం, బుద్ధిబలం, ఆత్మబలం, సిద్ధించి ఆరోగ్యవంతులుగా ఉంటారని మహాద్రష్ట గ్లోబల్ యూనివర్సిటీ అచార్యులు చుక్కా మధు అన్నారు. నడిగూడెం సాయి మందిరంలో నిర్వహిస్తున్న ఉచిత ధ్యాన శిక్షణ శిబిరంలో బుధవారం పాల్గొని ధ్యానంపై అవగాహన కల్పించారు. పిరమిడ్ సొసైటీ నుంచి ధ్యానంలో మాస్టర్లను తయారు చేయాలనే సంకల్పంతో ఉచిత శిక్షణలు ఏర్పాటు చేసినట్లు చెప్పారు. సత్యనారాయణరెడ్డి, శ్రీనివాసరావు, ఉపేందర్ పాల్గొన్నారు.

అవీ ఇవీ

ఎన్నిక.. మఠంపల్లి: పాస్టర్ల సంఘం మండల కమిటీ ఎన్నిక మంచ్యాతండా ఇండిపెండెంట్ బాప్టిస్ట్ చర్చిలో బుధవారం జరిగింది. అధ్యక్షుడిగా ఆర్.బాలూనాయక్, కార్యనిర్వాహక అధ్యక్షుడిగా కె.ఆశీర్వాదం, గౌరవ అధ్యక్షుడిగా మంగ్యానాయక్, కార్యదర్శిగా బి.కరుణాకర్, కోశాధికారిగా జె.బాలాజీ, సంయుక్త కార్యదర్శిగా కృపానందం, కార్యవర్గ సభ్యులుగా మరో ఐదుగురు ఎన్నికయ్యారు. హుజూర్‌నగర్ నియోజకవర్గ అధ్యక్షుడు కె.కృపానందం, ఛైర్మన్ సుధాకర్ పాల్గొన్నారు.

చిలుకూరు: మట్టపల్లి శ్రీలక్ష్మీ నృసింహస్వామి దేవస్థాన శాలివాహన(కుమ్మరి) నిత్య అన్నదాన సత్రం నిర్మాణ కార్యవర్గ సభ్యుడిగా బేతవోలుకు చెందిన కడారు రామకృష్ణ ఎన్నికయ్యారు.

సంతాపం.. మఠంపల్లి: బక్కమంతులగూడేనికి చెందిన సీపీఐ నాయకురాలు గోవిందమ్మ మృతి తమకు తీరని లోటని ఆ పార్టీ మండల కార్యదర్శి పున్నయ్య అన్నారు. బుధవారం గ్రామంలో జరిగిన సంతాప సభలో ఆయన మాట్లాడారు. రామకృష్ణ, ఆలీబాబా, సుబ్బారావు, నాగేశ్వరరావు, సాంబ, సతీష్ పాల్గొన్నారు.

నేరేడుచర్ల: సీపీఎం నాయకుడు ఎల్ల సైదులు మృతి పట్ల డీవైఎఫ్ మాజీ కార్యదర్శి విప్లవకుమార్, సీపీఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యుడు శేఖర్‌రావు, కె.నగేష్, నేరేడుచర్ల, పాలకవీడు మండలాల కార్యదర్శులు బుధవారం అంతిమయాత్రలో పాల్గొని సంతాపం తెలిపారు.

వినతి.. చిలుకూరు: మండలంలోని వివిధ గ్రామ పంచాయతీలలో గత ఐదు సంవత్సరాలుగా ఉపాధిహామీ పనులను చేయిస్తున్న వారందరిని క్షేత్రస్థాయి సహాయకులుగా నియమించాలని కోరుతూ జడ్పీ సీఈవో అప్పారావుకు వినతిపత్రాన్ని అందజేశారు. పలువురు సీనియర్ మేట్లు మాట్లాడుతూ తమకు అన్ని అర్హతలున్నాయని, సహాయకులుగా నియమించాలని వినతి పత్రంలో పేర్కొన్నట్లు తెలిపారు.

రద్దు చేయాలి.. మునగాల: డీఎస్సీ నియామకాల్లో 10 శాతం ఈడబ్ల్యూఎస్ రిజర్వేషన్ వల్ల బీసీ అభ్యర్థులకు తీవ్ర అన్యాయం జరిగిందని, వెంటనే ప్రభుత్వం ఈడబ్ల్యూఎస్‌ను రద్దు చేయాలని బీసీ విద్యార్థి సంఘం నియోజకవర్గ అధ్యక్షుడు లక్ష్మీనారాయణ అన్నారు. బీసీలు ఐక్యంగా పోరాడాలని పిలుపునిచ్చారు.

ఫిర్యాదు.. మోతె: నామవరం గ్రామ పంచాయతీలో 2019-2024 కాలంలో మంజూరైన పంచాయతీ నిధులు దుర్వినియోగం అయ్యాయని గతంలో ఉపసర్పంచి రేణుక, పలువురు వార్డు సభ్యులు జిల్లా కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు. ఈ నేపథ్యంలో బుధవారం డీపీవో నారాయణరెడ్డి పంచాయతీ దస్త్రాలను స్వాధీనం చేసుకున్నారు.

సన్మానం.. కోదాడ పట్టణం: తెలంగాణ సాయుధ పోరాటంలో నల్గొండ కవుల పాత్ర అనే అంశంపై పరిశోధన చేసి డాక్టరేట్ పొందిన విజయ్‌కుమార్‌ను మైత్రీ కంప్యూటర్ నందు సామాజిక వేదిక, మాజీ ఎస్ఎఫ్ఐ నాయకుల ఆధ్వర్యంలో బుధవారం సన్మానించారు.

సూర్యాపేట

• సూర్యాపేట • తుంగతుర్తి

శిక్షణ సద్వినియోగం చేసుకోవాలి

పెన్‌పహాడ్, న్యూస్‌టుడే: గ్రామాల్లో ఇంటింటికి స్వచ్ఛమైన నీటిని సరఫరా చేసేందుకు తగిన చర్యలు చేపడుతున్నామని ఆర్‌డబ్ల్యూఎస్ డీఈ పాండు, ఎంపీడీవో వెంకటేశ్వర్‌రావు అన్నారు. మండల ప్రజాపరిషత్ కార్యాలయంలో బుధవారం గ్రామ మంచినీటి సహాయకుల శిక్షణ కార్యక్రమంలో మాట్లాడారు. గ్రామీణ నీటి సరఫరా పైపులైన్ లీకేజీలు, బోరు మోటార్ల మరమ్మతులు, ఓహెచ్‌ఎస్సార్ నీటి ట్యాంకుల క్లోరినేషన్ తదితర అంశాలపై మాస్టర్ ట్రైనర్ నాగయ్య అవగాహన కల్పించారు. ఎంపీవో సంజీవయ్య, ఏఈ శ్రీనివాస్ పాల్గొన్నారు.

డీఏలు వెంటనే మంజూరు చేయాలి

సూర్యాపేట (మహాత్మాగాంధీ రోడ్డు), న్యూస్‌టుడే: రాష్ట్రంలో విద్యా పాలసీని అమలు చేసి బడుగు, బలహీన వర్గాల విద్యార్థులకు నాణ్యమైన సమానమైన విద్యనందించాలని టీఎస్ యూటీఎఫ్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు సీహెచ్. రాములు ప్రభుత్వాన్ని కోరారు. పట్టణంలోని ఆ సంఘం కార్యాలయంలో బుధవారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. రాష్ట్ర ప్రభుత్వం నియమించిన విద్యా కమిషన్ సిఫార్సులను త్వరితగతిన వచ్చేలా చేయాలన్నారు. ఉద్యోగులు, ఉపాధ్యాయులు, పెన్షనర్లకు ప్రకటించాల్సిన నాలుగు విడతల కరవు భత్యాన్ని వెంటనే మంజూరు చేయాలని డిమాండ్ చేశారు. పాఠశాలల్లో వెంటనే స్వీపర్లను నియమించాలని కోరారు. యూటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు సోమయ్య, జిల్లా ప్రధాన కార్యదర్శి అనిల్ కుమార్, రాష్ట్ర కార్యదర్శి శ్రీనివాస్‌రెడ్డి, అరుణ భారతి, వెంకటయ్య పాల్గొన్నారు.



సూర్యాపేట: సమావేశంలో మాట్లాడుతున్న యూటీఎఫ్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు సీహెచ్.రాములు

కళ్లకు గంతలు కట్టుకొని నిరసన



తుంగతుర్తిలో నిరసన వ్యక్తం చేస్తున్న నాయకులు

తుంగతుర్తి, న్యూస్‌టుడే: నియోజకవర్గానికి ప్రభుత్వం మంజూరు చేసిన సమీకృత గురుకుల పాఠశాలను తుంగతుర్తిలో కాకుండా సూర్యాపేట జిల్లా సరిహద్దు గ్రామమైన తొండలో ఏర్పాటు చేయటాన్ని వ్యతిరేకిస్తూ తుంగతుర్తి అభివృద్ధి సాధన సమితి ఆధ్వర్యంలో నిరసన వ్యక్తం చేశారు. తడ్కమల్ల రవికుమార్ నేతృత్వంలో బుధవారం ప్రధాన రహదారిపై నాయకులు కళ్లకు గంతలు కట్టుకుని నిరసన తెలిపారు. లేనిపక్షంలో నియోజకవర్గ వ్యాప్తంగా ఆందోళనలు చేపడతామన్నారు. గోపగాని శ్రీను, మధు, మల్లేష్, వెంకన్న, నాగమల్లు పాల్గొన్నారు.

భానుపురి, న్యూస్‌టుడే:

? సూర్యాపేటలోని కృష్ణాటాకీస్ పరిధిలో వీధి దీపాలు సరిగా వెలగటం లేదు. అంధకారం నెలకొని కాలనీవాసులు ఇబ్బందులు పడుతున్నారు. – సాయి, సూర్యాపేట

✔ పరిశీలించి వెలిగేలా చూస్తాం. – తిరుమలయ్య, పుర ఏఈ, సూర్యాపేట

మేమున్నాం.. మీకు తోడుగా.. (10 AM to 1 PM)
సూర్యాపేట: 9154395978
తుంగతుర్తి: 80085 74450

సూర్యాపేట పురపాలిక, న్యూస్‌టుడే:

? సూర్యాపేటలోని 27వ వార్డు ముగ్దూంనగర్‌లో సీసీ రహదారి అధ్వానంగా మారింది. కంకర తేలటంతో వాహనదారులు, ప్రయాణికులు రాకపోకలకు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. – సంపత్, ముగ్దూంనగర్

✔ పరిశీలించి మరమ్మతు చేపడతాం. – శ్రీనివాస్, పుర కమిషనర్, సూర్యాపేట.



ఈ చిత్రం సూర్యాపేట పట్టణం బాలాజీనగర్‌లోనిది. మురుగుకాల్వ వరకు ఇల్లు నిర్మించుకొని.. రహదారిపైనే మెట్లు కట్టారు. నిబంధనల ప్రకారం రహదారి తర్వాత ఐదు ఫీట్లు వదిలి ఇల్లు నిర్మించుకోవాలి. కానీ, ఈ నిబంధనను విస్మరించి పట్టణంలో ఇష్టారాజ్యంగా ఇళ్లు కట్టుకుంటున్నారు.

దారితప్పి.. మెట్లు కట్టి

☛ 'పేట'లో సెట్‌బ్యాక్ పాటించకుండా నిర్మాణాలు

సూర్యాపేట పురపాలిక, న్యూస్‌టుడే: సూర్యాపేట పురపాలిక పరిధిలో అంతర్గత రహదారులు రోజురోజుకూ ఇరుకుగా మారుతున్నాయి. ప్లాట్లు చేసినప్పుడు రహదారికి 30 ఫీట్ల స్థలం వదిలి.. ఇళ్ల నిర్మాణానికి పురపాలిక నుంచి అనుమతి తెచ్చుకుంటున్నారు. ఇంటిని మాత్రం రహదారి పక్కనే నిర్మిస్తున్నారు. సెట్‌బ్యాక్ కింద ఐదు ఫీట్ల స్థలాన్ని వదిలాల్సి ఉన్నా.. ఆ నిబంధనను విస్మరించి నిర్మాణాలు చేపడుతున్నారు. కొందరు ప్రహరీ, మరికొందరు భవనం మెట్లను మురుగు కాల్వపైనే కట్టుకుంటున్నా.. పట్టించుకునే అధికారులు కరవు. మురుగు కాల్వ, సీసీ రహదారి మీదుగా ప్రహరీతోపాటు లోనికి వాహనాలు వెళ్లడానికి వీలుగా ఎత్తుగా మెట్లు నిర్మించుకుంటున్నారు. రోడ్డు ఇరుకుగా మారిందని ఇరుగు పొరుగు ప్రశ్నిస్తే.. ఇళ్ల యజమానులు బెదిరింపులకు పాల్పడుతున్నారు. స్థానిక రాజకీయ నాయకుల అండతో దూషణకు సిద్ధమవుతున్నారు. రోడ్డుపైనే ఎత్తుగా కట్టిన మెట్ల వల్ల రాకపోకలకు ఇబ్బందులు ఎదురవుతున్నాయి. రాత్రివేళల్లో ప్రమాదాలు జరుగుతున్నాయి.

పరిశీలించి చర్యలు తీసుకుంటాం

– శ్రీనివాస్, పుర కమిషనర్, సూర్యాపేట

సూర్యాపేట పట్టణంలో పుర నిబంధనల ప్రకారం సెట్‌బ్యాక్ వదిలి ఇళ్ల నిర్మాణాలు చేపట్టాలి. నిబంధనలకు విరుద్ధంగా నిర్మిస్తే కఠిన చర్యలు తప్పవు. పట్టణంలో ఎక్కడెక్కడ నిర్మించారో పరిశీలించి చర్యలు తీసుకుంటాం.

నిబంధనలు విస్మరిస్తున్నారిలా..


సూర్యాపేట పట్టణంలో చర్చికాంపౌండ్, శ్రీరాంనగర్, అంబేడ్కర్‌నగర్, బాలాజీనగర్, కృష్ణాకాలనీ, విద్యానగర్, జమ్మిగడ్డ, హౌసింగ్‌బోర్డు కాలనీ, తదితర ప్రాంతాల్లో మురుగు కాల్వ, రహదారి మీదనే మెట్లు నిర్మించారు. పుర అధికారులు అనుమతులకు విరుద్ధంగా సెట్ వదిలి ప్రహరీలు నిర్మిస్తున్నారు. ప్రభుత్వ నిబంధనల ప్రకారం మున్సిపల్ అధికారులు 30 ఫీట్ల రోడ్డు ఉంటేనే ఇళ్ల నిర్మాణాలకు అనుమతి ఇస్తారు. అలా అనుమతి పొందిన గృహ యజమానులు కొంతమంది 25 అడుగుల రహదారులు వెంట సెట్‌బ్యాక్ వదలకుండా నిర్మాణాలు చేపడుతున్నారు. అధికారులు క్షేత్రస్థాయిలో తనిఖీ చేపట్టకుండా కొందరు గృహ యజమానులు మామూళ్ల ఆశ చూపి మచ్చిక చేసుకుంటుండటంతో రహదారులు కుచించుకుపోతున్నాయి. ఇప్పటికైనా సంబంధిత అధికారులు తనిఖీలు జరిపి బాధ్యులపై చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

సూర్యాపేట పట్టణ ముఖచిత్రం

మొత్తం వార్డులు	48
జనాభా	1.42 లక్షలు
నిబంధనల ప్రకారం రహదారి వెడల్పు	30 ఫీట్లు
సెట్ బ్యాక్ వదలాల్సి దూరం	5 ఫీట్లు

చేగువేరా పోరాట స్ఫూర్తిని కొనసాగిద్దాం

చివ్వెంల, న్యూస్‌టుడే: ప్రపంచ విప్లవ పోరు కెరటం చేగువేరా పోరాట స్ఫూర్తిని కొనసాగిద్దామని సీపీఐ(ఎం.ఎల్) మాస్‌లైన్ పార్టీ జిల్లా కార్యదర్శి కొత్తపల్లి శివకుమార్ అన్నారు. చేగువేరా వర్ధంతి సందర్భంగా సూర్యాపేట జిల్లా కేంద్రం సమీపంలోని కుడకుడ పరిధిలో లెనిన్‌నగర్‌లో బుధవారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రపంచంలో అమెరికా సామ్రాజ్యవాదాన్ని, మనదేశంలో భాజపా ఫాసిజాన్ని చేగువేరా స్ఫూర్తితో పోరాడటంతోపాటు ప్రజా ఉద్యమాలను ఉధృతం చేయాలన్నారు. వెంకన్న, రేణుక, అఖిల్‌కుమార్, నర్సయ్య, నాగయ్య, హుస్సేన్ పాల్గొన్నారు.



చేగువేరా చిత్రపటానికి నివాళి అర్పించి నినదాలు చేస్తున్న సీపీఎం(ఎం.ఎల్) నాయకులు

గుడుంబా స్థావరాలపై దాడులు

నూతనకల్ గ్రామీణం, న్యూస్‌టుడే: పోలీస్, ఎక్సైజ్ శాఖ సంయుక్తంగా గుడుంబా స్థావరాలపై బుధవారం దాడులు చేసి ఇద్దరిపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై మహేంద్రనాథ్, ఎక్సైజ్ సీఐ రజిత తెలిపారు. ప్రభుత్వ నిషేధిత బెల్లం, గుడుంబా తయారీ చేస్తున్న బక్కహేమ్లతండా, బద్యాతండాకు చెందిన నెనావత్ నాగమ్మ, బుచ్చాలులపై కేసు నమోదు చేసినట్లు తెలిపారు. దాడుల్లో 20 కిలోల బెల్లం, 10 లీటర్ల నాటు సారా సీజ్ చేసి 50 లీటర్ల బెల్లం పానకం ధ్వంసం చేసినట్లు పేర్కొన్నారు. ఎక్సైజ్ ఎస్సై మూర్తి, రెండు శాఖల సిబ్బంది పాల్గొన్నారు.

ఎన్నికలు- నియామకాలు



వెంకటచంద్ర



జ్యోతి

కుడకుడరోడ్డు(సూర్యాపేట), న్యూస్‌టుడే: అఖిల భారత ప్రజాతంత్ర మహిళా సంఘం(ఐద్వా) జిల్లా అధ్యక్ష, కార్యదర్శులుగా తంగెళ్ల వెంకటచంద్ర, మద్దెల జ్యోతి ఏకగ్రీవంగా ఎన్నికైనట్లు బుధవారం స్వయంగా ఒక ప్రకటనలో తెలిపారు. సూర్యాపేట జిల్లా కేంద్రంలో ఇటీవల జరిగిన ఐద్వా జిల్లా మహాసభలో ఎన్నుకున్నట్లు పేర్కొన్నారు.



నరేష్


పెన్‌పహాడ్, న్యూస్‌టుడే: మండలంలోని అనంతారం గ్రామానికి చెందిన నెమ్మాది నరేష్ దళితమోర్చా జిల్లా అధ్యక్షుడిగా ఎంపికయ్యారు. భాజపా జిల్లా అధ్యక్షుడు బొబ్బా భాగ్యరెడ్డి తనను ఎంపిక చేశారని బుధవారం ఓ ప్రకటనలో తెలిపారు. నియామకపత్రాన్ని పార్టీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు సంకినేని వెంకటేశ్వర్‌రావు జిల్లా కేంద్రంలో తనకు అందజేశారని చెప్పారు.




మధు

భానుపురి, చివ్వెంల, న్యూస్‌టుడే: తెలంగాణ ఉద్యమకారుల ఫోరమ్(టీయూఎఫ్) దక్షిణ తెలంగాణ సమన్వయకర్తగా చివ్వెంల మండలం బండమీది చందుపట్ల గ్రామానికి చెందిన తెలంగాణ ఉద్యమ నాయకుడు అనంతుల మధు నియమితులయ్యారు. హైదరాబాద్‌లోని సంఘం కార్యాలయంలో బుధవారం జరిగిన రాష్ట్రకమిటీ సమావేశంలో ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు ఆయన తెలిపారు. తెలంగాణ ఉద్యమకారుల సంక్షేమానికి తనవంతుగా పాటుపడతానని పేర్కొన్నారు. తన ఎన్నికకు సహకరించిన సంఘం నాయకులకు కృతజ్ఞతలు తెలిపారు.

పీఆర్‌టీయూ కార్యవర్గంలో చోటు



శివయ్య



శ్రీనివాస్

నూతనకల్ గ్రామీణం, న్యూస్‌టుడే: పీఆర్‌టీయూ టీఎస్ రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షులుగా మండలంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాల లింగంపల్లి, పెదనెమిలకు చెందిన గుండగాని శ్రీనివాస్, దానావత్ శివయ్య, గునగంటి శ్రీనివాస్, చౌవగాని వెంకయ్య ఎన్నికైనట్లు బుధవారం మండల కేంద్రంలో తెలిపారు. మంగళవారం హైదరాబాద్‌లో ఏర్పాటు చేసిన రాష్ట్ర కార్యవర్గంలో నియమించినట్లు పేర్కొన్నారు. రాష్ట్ర ఉపాధ్యక్షుడిగా తాళ్లసింగారం పాఠశాలకు చెందిన మన్నెం వెంకన్న, రాష్ట్ర కార్యదర్శిగా వెంకేపల్లి పాఠశాలకు చెందిన అనంతుల శ్రీశైలంను నియమించినట్లు తెలిపారు. కొత్తగా మండలం నుంచి రాష్ట్ర కార్యవర్గానికి ఎన్నికైన ఉపాధ్యాయులను మండల పీఆర్‌టీయూ నాయకులు అభినందించారు. నాగయ్య, శ్రీనివాస్, మహేశ్వరం వెంకటయ్య, సోమయ్య తదితరులున్నారు.



దండుగుల ఎల్లయ్య

జాజిరెడ్డిగూడెం, న్యూస్‌టుడే: కాసర్లపహాడ్ జడ్పీ ఉన్నత పాఠశాలలో ఉపాధ్యాయుడిగా పని చేస్తున్న దండుగుల ఎల్లయ్యను పీఆర్టీయూ టీఎస్ రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షుడిగా నియమించినట్లు బుధవారం ఆయన ఒక ప్రకటనలో తెలిపారు. నియామకానికి సహకరించిన మండల శాఖ, జిల్లా శాఖల నాయకులకు కృతజ్ఞతలు తెలిపారు.

ఎస్సీ వర్గీకరణ అమలు చేయాలి



సూర్యాపేట: నిరసన తెలుపుతున్న ఎమ్మార్పీఎస్, ఎంఎస్‌పీ నాయకులు

సూర్యాపేట పట్టణం, న్యూస్‌టుడే: సుప్రీం కోర్టు తీర్పు ఇచ్చాక కూడా సీఎం రేవంత్‌రెడ్డి వర్గీకరణ విషయంలో మాదిగలను మోసం చేస్తున్నారని ఎంఎస్‌పీ జిల్లా అధ్యక్షుడు యాతాకుల రాజన్న మాదిగ, ఎమ్మార్పీఎస్ జిల్లా అధ్యక్షుడు చింత వినయ్ ఆరోపించారు. ఎస్సీ రిజర్వేషన్ల వర్గీకరణపై జిల్లా కేంద్రంలోని బాబు జగ్జీవన్ రామ్ విగ్రహం నుంచి కలెక్టరేట్ వరకు బుధవారం నిరసన ర్యాలీ చేపట్టారు. వారు మాట్లాడుతూ.. 30 ఏళ్లు పోరాడి అత్యున్నత న్యాయస్థానం ద్వారా సాధించుకున్నామని, తీర్పు వచ్చిన రోజు ముందుగానే తెలంగాణలోనే అమలు చేస్తామని సీఎం రేవంత్‌రెడ్డి మాట ఇచ్చారని గుర్తుచేశారు. ప్రస్తుతం అన్ని ఉద్యోగ నియామకాలు ఏ ఆర్డినెన్స్ లేకుండానే నియామకాలు చేస్తున్నారని, దీంతో మాదిగ, మాదిగ ఉప కులాల విద్యార్థులకు నష్టం జరుగుతుందన్నారు. వెంటనే వర్గీకరణ అమలు చేయాలని డిమాండ్ చేశారు. అనంతరం అదనపు కలెక్టర్ బీఎస్. లతకు వినతిపత్రం అందజేశారు. సోమన్న మాదిగ, ఖాసీం, వీరస్వామి మాదిగ, జాన్ విల్సన్, దయానంద్, కృష్ణ, రాము, సైదులు, రాజు, నాగేశ్వరి, ఆంజనేయులు, రవి పాల్గొన్నారు.

నాగారం వాసికి డాక్టరేట్



నాగారం, న్యూస్‌టుడే: మండల కేంద్రానికి చెందిన కందుకూరి లక్ష్మయ్య, సుకన్య దంపతుల కుమార్తె **కందుకూరి వందన** డాక్టరేట్ సాధించారు. ఆమె మహాత్మాగాంధీ విశ్వవిద్యాలయం నుంచి 'ఏ స్టడీ ఆన్ వర్క్‌లైఫ్ బ్యాలెన్స్ విత్ స్పెషల్ రిఫరెన్సు టు మెడికల్ ప్రాక్టిషనర్స్ ఆఫ్ వరంగల్ డిస్ట్రిక్ట్' అనే అంశంపై యూనివర్సిటీ రిజిస్ట్రార్ అలువాల రవి పర్యవేక్షణలో పరిశోధనలు చేసి పీహెచ్‌డీ పూర్తి చేశారు. ఈ సందర్భంగా యూనివర్సిటీ పరీక్షల నియంత్రణాధికారి ప్రొఫెసర్ జి. ఉపేందర్‌రెడ్డి డాక్టరేట్ ప్రకటించారు.

అవినీతి పరులపై చర్యలు తీసుకోండి

స్పందనకు వందనం



నూతనకల్ తహసీల్ కార్యాలయంలో అధికారులను వివరాలు అడుగుతున్న ఆర్డీవో వేణుమాధవరావు

నూతనకల్ గ్రామీణం, న్యూస్‌టుడే: మండల పరిధిలోని మాచనపల్లిలో నకిలీ ధ్రువీకరణ పత్రాలు జతచేసి కల్యాణలక్ష్మి చెక్కులు పొందిన అవినీతి పరులపై 'ఈనాడు'లో 'కల్యాణలక్ష్మికి అవినీతి మకిలీ' శీర్షికన ఆదివారం ప్రచురితమైన కథనానికి అధికారులు స్పందించారు. పూర్తిస్థాయి విచారణ నిర్వహించి(సోమవారం, మంగళవారం) తహసీల్దారు నివేదికను ఉన్నతాధికారులకు పంపగా ఆర్డీవో వేణుమాధవరావు బుధవారం తహసీల్ కార్యాలయంలో తనిఖీలు చేసి బాధ్యులైన 11 మందిపై కేసు నమోదు చేయాలని ఆదేశించారు. సరైన పత్రాలు లేని మరో 11 మంది దరఖాస్తులను నిలిపివేశారు. కల్యాణలక్ష్మి మంజూరైన మరో నలుగురి చెక్కులను నిలిపి వేయాలని సూచించారు. తప్పుడు పత్రాలు జారీ చేసిన అధికారులు, సహకరించిన వారిపై చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ప్రలోభాలకు లోనై తప్పుడు పత్రాలు జారీ చేస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. ఎంపీడీవో సునీత, తహసీల్దారు శ్రీనివాస్‌రావు, ఎస్సై మహేంద్రనాథ్ అధికారులున్నారు.

ఆర్ఐకి శ్రీముఖాలు జారీ.. అవినీతికి పాల్పడిన వారికి సహకరిస్తూ పత్రాలను పరిశీలించకుండా ఫార్వర్డ్ చేసిన ఆర్ఐ లక్ష్మీప్రసాద్‌కు ఆర్డీవో ఆదేశాల మేరకు శ్రీముఖాలు జారీచేసినట్లు తహసీల్దారు శ్రీనివాస్‌రావు తెలిపారు. నకిలీ ధ్రువపత్రాల పేరుతో లబ్ధి పొందిన వారిని పరిశీలించి కారుకులైన వారిపై కేసు నమోదు చేయనున్నట్లు వివరించారు.



అవీ.. ఇవీ

తరలివెళ్లిన ఉపాధ్యాయులు.. తిరుమలగిరి: డీఎస్సీ-2024లో తుంగతుర్తి నియోజకవర్గం నుంచి ఎంపికైన ఉపాధ్యాయులు హైదరాబాద్‌లోని ఎల్‌బీ స్టేడియంలో సీఎం చేతుల మీదుగా అందించే నియామక పత్రాలను తీసుకునేందుకు తరలివెళ్లారు. స్థానిక తహసీల్ కార్యాలయం వద్ద ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన బస్సులో వెళ్లారు. తిరుమలగిరి, నాగారం ఎంఈవోలు ఐ. శాంతయ్య, వి. ప్రభాకర్ వీరికి నేతృత్వం వహించారు. నాయబ్ తహసీల్దార్ జాన్‌మహ్మద్, సిబ్బంది పులిగిళ్ల శ్యాం, తదితరులు పాల్గొన్నారు.

అథ్లెటిక్ పోటీల్లో ప్రతిభ.. తుంగతుర్తి, న్యూస్‌టుడే: పదో తెలంగాణ రాష్ట్ర జూనియర్ అథ్లెటిక్ ఛాంపియన్‌షిప్‌లో తుంగతుర్తి గురుకుల విద్యార్థి డి. లోకేష్ ప్రతిభ చాటి ద్వితీయ బహుమతిని గెలుచుకున్నాడు. రెండు రోజుల క్రితం హన్మకొండలో జరిగిన పోటీల్లో షాట్‌పుట్ విభాగం నుంచి పాల్గొని సత్తా చాటాడు. ఈ సందర్భంగా పలువురు అభినందించారు.



రాష్ట్ర క్రికెట్ జట్టుకు ఎంపిక.. తుంగతుర్తి: తెలంగాణ రాష్ట్ర ఎస్జీఎఫ్ క్రికెట్ జట్టుకు తుంగతుర్తికి చెందిన వీరబోయిన **అఖిలేష్ యాదవ్** ఎంపికయ్యాడు. జిల్లా కేంద్రంలోని ఎస్జీఎఫ్ క్రికెట్ స్టేడియంలో ఎస్జీఎఫ్ అండర్ 14 విభాగంలో జిల్లాస్థాయి పోటీలు బుధవారం జరిగాయి. దీంట్లో నల్గొండ జట్టుపై సూర్యాపేట జట్టు విజయం సాధించింది. ఈ గెలుపులో ప్రతిభ చూపిన అఖిలేష్‌ను రాష్ట్ర జట్టుకు ఎంపిక చేశారు. ఈ సందర్భంగా పలువురు అభినందించారు.



కృతజ్ఞతలు తెలిపిన ఎమ్మెల్యే.. తిరుమలగిరి, న్యూస్‌టుడే: తుంగతుర్తి నియోజకవర్గంలోని తిరుమలగిరిలో యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ పాఠశాలను మంజూరు చేసినందుకు బుధవారం హైదరాబాద్‌లోని క్యాంపు కార్యాలయంలో సీఎం రేవంత్‌రెడ్డిని, ఉపముఖ్యమంత్రి భట్టి విక్రమార్కను ఎమ్మెల్యే మందుల సామేల్ కలిసి కృతజ్ఞతలు తెలిపారు.

13న వివాహ పరిచయ వేదిక.. భానుపురి: సూర్యాపేట పట్టణంలో ఈనెల 13న నిర్వహించనున్న విశ్వబ్రాహ్మణ ఉచిత వివాహ పరిచయ వేదికను సద్వినియోగం చేసుకోవాలని విశ్వకర్మ ఫౌండేషన్ సేవా సంస్థ వ్యవస్థాపక అధ్యక్షుడు అడ్లూరి రవీంద్రచారి కోరారు. సూర్యాపేటలో బుధవారం సంఘం నాయకుల సమావేశంలో ఆయన మాట్లాడారు. తెలుగు రాష్ట్రాల్లో కుటుంబాల వివరాలు సేకరించి అవసరమున్న వారికి సమాచారం అందిస్తున్నామన్నారు. ఈ వివాహ పరిచయ వేదిక 10.30 నుంచి 4.30 గంటల వరకు నిర్వహించనున్నట్లు తెలిపారు. సంఘం సభ్యులు వీరబ్రహ్మాచారి, బ్రహ్మయ్య, శ్రీనివాస్, సీతారామాచారి, సలేంద్రచారి, పూరిపూర్ణాచారి, తదితరులు పాల్గొన్నారు.

రేషన్ బియ్యం పట్టివేత.. సూర్యాపేట నేరవిభాగం, న్యూస్‌టుడే: అక్రమంగా తరలిస్తున్న 40 క్వింటాళ్ల రేషన్ బియ్యాన్ని పట్టుకున్నట్లు ఎస్సై బాలునాయక్ తెలిపారు. కేతేపల్లి గ్రామానికి చెందిన జటంగి శంబయ్య స్వగ్రామం నుంచి ఆటోలో 20 క్వింటాళ్ల బియ్యం తరలిస్తుండగా రాయిన్‌గూడెం శివారులో పట్టుకున్నారు. భాషానాయక్ తండాకు భూక్య కుమార్ ఆటోలో అక్రమంగా 20 క్వింటాళ్ల బియ్యాన్ని తరలిస్తుండగా జనగాం క్రాస్ రోడ్డు వద్ద పట్టుకున్నట్లు పేర్కొన్నారు. ఈ రెండు ఘటనల్లో ఇరువురిపై కేసు నమోదు చేసినట్లు వెల్లడించారు.

వ్యవసాయ మార్కెట్ ధరలు

భానుపురి, న్యూస్‌టుడే: సూర్యాపేట వ్యవసాయ మార్కెట్‌కు బుధవారం వచ్చిన వివిధ పంట ఉత్పత్తులకు పలికిన గరిష్ఠ, కనిష్ఠ ధరల వివరాలు(రూపాయల్లో).

రకం	గరిష్ఠం	కనిష్ఠం
బీపీటీ	3123	1809
జైశ్రీరాం	3212	1971
ఐఆర్-64	1986	1736
హెచ్‌ఎంటీ	2843	2069
కందులు	8438	5859
పెసర	6462	2263
వేరుసెనగ	7109	2556
మొక్కజొన్న	1350	1350

మత్తుకు బానిసైతే జీవితం అంధకారం



గుమ్మడవెల్లిలో మత్తు పదార్థాలపై అవగాహన కల్పిస్తున్న సీఐ శ్రీను

మద్దిరాల, న్యూస్‌టుడే: యువత మత్తు పదార్థాలకు అలవాటు పడి జీవితాలను నాశనం చేసుకోవద్దని సీఐ శ్రీను సూచించారు. బుధవారం మండలంలోని కుక్కడం, గుమ్మడవెల్లిలలో స్థానికులకు శాంతిభద్రతలు, మత్తు పదార్థాలపై అవగాహన కల్పించారు. ఎస్సై ఎం. వీరన్న, సిబ్బంది పాల్గొన్నారు.

శాంతియుతంగా పండగ జరుపుకోవాలి.. నాగారం: మండలంలోని ప్రజలు ప్రశాంత వాతావరణంలో సద్దుల బతుకమ్మ, దసరా ఉత్సవాలను నిర్వహించుకోవాలని ఎస్సై ఐలయ్య విజ్ఞప్తి చేశారు. మండలంలోని అన్ని గ్రామాల్లో వివిధ పార్టీల నాయకులు, పెద్దమనుషులతో శాంతి సమావేశాలు నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ.. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు, వర్గ విభేదాలు తలెత్తకుండా ప్రజలు సంతోషంగా పండగను జరుపుకోవాలన్నారు. రెచ్చగొట్టే, హింసాత్మక చర్యలకు పాల్పడితే కఠిన చర్యలుంటాయని హెచ్చరించారు.

గ్రామ సిబ్బందికి వస్తువుల పంపిణీ

నాగారం, న్యూస్‌టుడే: పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవడం ప్రతి ఒక్కరు బాధ్యతగా భావించాలని మండల పంచాయతీ అధికారి మారయ్య సూచించారు. మండలంలోని ఫణిగిరి, డి కొత్తపల్లి గ్రామాల్లోని పారిశుద్ధ్య సిబ్బందికి బుధవారం సబ్బులు, నూనెలను పంపిణీ చేశారు. పంచాయతీ కార్యదర్శి కొమ్ము అరుణ్‌కుమార్ పాల్గొన్నారు.

పండగ పూట.. లైట్లు వెలగక



అర్వపల్లిలో సూర్యాపేట-జనగాం జాతీయ రహదారిపై సెంట్రల్ లైటింగ్ వెలగక అంధకారం నెలకొంది. గత వారం రోజుల నుంచి ఇదే పరిస్థితి ఉండటంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. సద్దుల బతుకమ్మ, దసరా ఉత్సవాలు ఉండటంతో పండగ పూట చీకటి నెలకొనడంతో రాత్రి పూట నానా అవస్థలు పడుతున్నారు. అధికారులు తక్షణమే చర్యలు తీసుకుని విద్యుత్తు దీపాలు వెలిగేలా చూడాలని కోరుతున్నారు. ఈ విషయంపై ఇన్‌ఛార్జి పంచాయతీ కార్యదర్శి నాగయ్యను అడగగా.. సంబంధిత అధికారుల దృష్టికి తీసుకెళ్తానని తెలిపారు.

– న్యూస్‌టుడే, జాజిరెడ్డిగూడెం

అమ్మలగన్నమ్మ.. అభయమివ్వమ్మ



తిరుమలగిరిలో పూజల్లో పాల్గొన్న రాజస్థాన్ మహిళలు

నూతనకల్, న్యూస్‌టుడే: నూతనకల్‌తోపాటు యడవెల్లి, తాళ్లసింగారం, వెంకేపల్లి, చిల్పకుంట్ల గ్రామాల్లో దేవి నవరాత్రి ఉత్సవాలను బుధవారం ఘనంగా నిర్వహించారు. తాళ్లసింగారం, నూతనకల్‌లో కుంకుమపూజ, యడవెల్లి, చిల్పకుంట్లలో అన్నదాన మహోత్సవం చేపట్టారు. చిల్పకుంట్లలో ఎస్సై మహేంద్రనాద్ పాల్గొని పూజలు చేశారు.

తిరుమలగిరి: తిరుమలగిరిలో ఏర్పాటు చేసిన మండపం వద్ద అమ్మవారికి రాజస్థాన్ మహిళలు ప్రత్యేక పూజలు చేశారు. నిర్వాహకులు ఎస్. రఘునందన్‌రెడ్డి, కొంపెల్లి రాంమూర్తి, రాజ్‌పూత్ కాలియా, తదితరులు పాల్గొన్నారు.

జాజిరెడ్డిగూడెం: అర్వపల్లిలోని ప్రధాన కూడలిలో కొమురంభీం యూత్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన దుర్గామాత విగ్రహం వద్ద బుధవారం భక్తిశ్రద్ధలతో మహిళలు కుంకుమార్చన నిర్వహించారు.

సూర్యాపేట (తాళ్లగడ్డ), న్యూస్‌టుడే: మండల పరిధిలోని పిన్నాయిపాలెం గ్రామంలో దుర్గామాత ఉత్సవాలు ఘనంగా నిర్వహించారు. ఏడో రోజు బుధవారం సరస్వతి అవతారంలో అమ్మవారు దర్శనమిచ్చారు. మాజీ సర్పంచి, ఉమ్మడి జిల్లా గ్రంథాలయ సంస్థ మాజీ ఛైర్మన్ అనంతుల జానకి రాంరెడ్డి జ్ఞాపకార్థం ఆయన కుమారులు శ్యాం ప్రసాద్‌రెడ్డి విద్యార్థులకు పరీక్ష అట్టలు, రాత పుస్తకాలు, పెన్నులు, పెన్సిళ్లు అందజేశారు. శ్రీనివాస్, రుక్మిణి, శ్రీనివాసులు, సైదిరెడ్డి, వెంకన్న, సుశీలమ్మ, చిన్న వెంకన్న, కొప్పు రమణయ్య, శ్రీకాంత్, అజయ్, మధు, శ్రీను, రేవంత్ పాల్గొన్నారు.



సూర్యాపేట: పిన్నాయిపాలెంలో.. అందజేసిన పరీక్షల అట్టలతో విద్యార్థులు

పెన్‌పహాడ్: మండలంలోని దూపహాడ్‌లో దుర్గాపరమేశ్వర, సీతారామాలయం ముందు నెలకొల్పిన దుర్గాదేవి మండపం వద్ద అన్నప్రసాద కార్యక్రమాన్ని ఎస్సై రవీందర్, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు తూముల సురేష్‌రావు ప్రారంభించారు. అనంతరం గ్రామపంచాయతీ సమీపంలో అమ్మవారి మండపం వద్ద మహా చండీహోమం నిర్వహించారు. సురేందర్‌రెడ్డి, జానకిరాం, పరంధాములు, కోటేశ్వర్‌రావు, కేశవులు, సైదులు, వీరయ్య, జనార్ధన్, సందీప్, వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

నాగారం: మాచిరెడ్డిపల్లిలో కాశీ లక్ష్మణశర్మ ప్రత్యేకపూజలు జరపగా మాజీ సర్పంచి పసుపులేటి ప్రేమలతారెడ్డి, వెంకటరెడ్డి దంపతులు అన్నదానం నిర్వహించారు.



నూతనకల్: తాళ్లసింగారంలో..



సూర్యాపేట 2వ వార్డులో కుంకుమ పూజలు నిర్వహిస్తున్న భక్తులు



దూపహాడ్‌లో అన్నదానం ప్రారంభిస్తున్న ఎస్సై రవీందర్, సురేష్‌రావు

'పట్టుబడినవి పీడీఎస్ బియ్యం కావు'

చివ్వెంల, న్యూస్‌టుడే: సూర్యాపేట పట్టణానికి సమీపంలోని దురాజ్‌పల్లి శివారులోని ఓ దాబాలో అక్రమంగా బియ్యం నిల్వ ఉంచారనే ఆరోపణలతో ఈనెల 7న పోలీసులు సుమారు 600 క్వింటాళ్ల బియ్యాన్ని పట్టుకొని స్వాధీన పరుచుకొన్న విషయం విదితమే. నిల్వ ఉంచిన బియ్యం పార్‌బాయిల్డ్ మిల్లుల్లో పాడైపోయిన(రిజెక్టెడ్) బియ్యమని పౌరసరఫరాల అధికారులు అదేరోజు ప్రాథమికంగా విచారణ చేసి తేల్చి చెప్పారు. అయినా పట్టుబడిన వాటిల్లో పీడీఎస్ బియ్యం కలిసి ఉన్నాయని పెద్దఎత్తున ఆరోపణలు రాగా వాటిని పూర్తిస్థాయిలో నిర్ధారించేందుకు పోలీసులు పరీక్షల నిమిత్తం బియ్యం నమూనాలను హైదరాబాద్‌కు పంపించారు. అనంతరం క్వాలిటీ అనాలిసిస్ నివేదిక తమకందిందని పౌరసరఫరాల శాఖ జిల్లా మేనేజర్ టీ.ఎన్.ఎస్. ప్రసాద్ బుధవారం వివరాలను వెల్లడించారు. పట్టుబడిన బియ్యంలో పీడీఎస్ బియ్యం కలిపినట్లు ఆధారాలు లేవన్నారు. బియ్యంలో 95శాతం నూకలు(270 క్వింటాల్), 80శాతం పాడైపోయి రంగుమారిన పచ్చి బియ్యం(170 క్వింటాల్), 70శాతం ఉప్పుడు బియ్యం(160 క్వింటాలు) ఉన్నట్లు తెలిపారు.